Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు
rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 209 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
శనివారం, 28 - 3 - 2026
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ఇంధన సమస్యల పర్యవేక్షణకు కేంద్ర మంత్రులతో కమిటీ



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిం చేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్‌పురి ఇందులో సభ్యులుగా ఉంటారు. మరోవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం తగ్గించింది. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కు తగ్గించింది. లీటరుకు రూ.10గా ఉన్న డీజిల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, మధ్యప్రాచ్య దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. పెరిగిన దిగుమతి వ్యయాన్ని తట్టుకుని చమురు సంస్థల రికవరీకి తాజాగా కేంద్రం తీసుకున్న చర్య ఉపయోగపడుతుంది. మరోవైపు, దేశవ్యాప్తంగా రిటైల్ ఔట్‌లెట్స్ యథాప్రకారం పని చేస్తున్నాయని, అన్ని పంపుల్లోనూ తగినన్ని పెట్రోల్, డీజిల్ స్టాక్‌లు ఉన్నాయని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని వినియోగదారులను కోరింది.

## ఎరువుల కొరత లేదు, ఆందోళన వద్దు : లోక్‌సభలో జేపీ నడ్డా




**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఘర్షణలు కారణంగా ఎరువులు, ముడి పదార్థాల రవాణాలో ఆలస్యం చోటుచేసుకుని రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ వస్తున్న వార్తలపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా లోక్‌సభలో స్పందించారు. ఎరువులపై యుద్ధ ప్రభావం పడకుండా రైతుల అవసరాలకు సరిపడా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. ఔషధాల తయారీకి ఇతర దేశాల నుంచి ముడిసరుకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు కూడా చర్యలు చేపట్టామని చెప్పారు. ముడిసరుకుల దిగుమతి విషయంపై ఒక్క దేశం పైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామని, ఇప్పటికే పలు దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకున్నా మని నడ్డా వివరించారు. ఔషధాల తయారీకి ఇతర దేశాల నుంచి ముడిసరుకు దిగుమతిపై ఆధార పడటాన్ని తగ్గించుకునేందుకు కూడా చర్యలు చేపట్టామని చెప్పారు. దీనికిముందు, పశ్చిమాసియాలో పరిస్థితిపై సమీక్షిం చేందుకు కేంద్ర మంత్రివర్గం మంగళవారం సమావేశమైంది. ఇందులో ప్రధానంగా ఎరువుల లభ్యత, సరఫరాపై చర్చించారు. ఖరీఫ్ సీజన్ వరకూ ఎలాంటి కొరత లేదని, రైతుల అవసరాలకు సరిపడా సరఫరా చేయగలమని సమావేశం ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే పశ్చిమాసియాలో సంక్షోభం ఇలాగే కొనసాగితే ఎరువుల ఉత్పత్తి 0.6 నుంచి 0.9 మిలియన్ టన్నుల మేరకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్‌పురి, ఆరోగ్య, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని చేతుల మీదుగా నోయిడా ఎయిర్‌పోర్ట్ ప్రారంభం.. ఎప్పుడంటే..

**ఢిల్లీ:** ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతానికి రేపటి నుంచి రెండో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుందని కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించనున్నారని ఆయన వెల్లడించారు. ఈ విషయాన్ని తెలియజేస్తున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు కేంద్రమంత్రి. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రజలందరికీ అభినందనలు తెలిపారు. 'రేపు జేవార్ వద్ద మీ అందరినీ కలుస్తా' అంటూ రామ్మోహన్ నాయుడు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కాగా, దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోవడంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికుల తాకిడి విపరీతంగా పెరిగింది. దీంతో ఈ ప్రాంతాల్లో మరో నూతన అంతర్జాతీయ ఎయిర్ పోర్టును నిర్మించాలని భావించింది. ఈ మేరకు ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం జేవార్‌లో నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసింది. అత్యాధునిక టెక్నాలజీ, హంగులతో దీన్ని నిర్మించారు. మార్చి 28న



జేవార్‌లో ప్రారంభోత్సవానికి తేదీ సైతం ఖరారు చేశారు. ఈ కొత్త విమానాశ్రయం దేశ విమానాశ్రయ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## దారుణం.. వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని రోకలి బండతో..

**అనంతపురం, (రాజధాని వార్తలు):** కల్యాణదుర్గం మండలం పాత చెరువు గ్రామంలో దారుణ ఘటన వెలుగు చూసింది. వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని భర్తను అతి కిరాతకంగా హత్య చేసింది ఓ భార్య. ఏకంగా ఇంట్లోనే పూడ్చిపెట్టి పోలీసులకే షాక్ ఇచ్చింది. హత్య గురించి బయట చెప్తే చంపేస్తానంటూ పిల్లలనూ బెదిరించింది. ఎప్పటికైనా విషయం బయటపడుతుందన్న భయంతో నేరుగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లి లొంగిపోయింది. ఈ ఘటన జిల్లాలో ఇప్పుడు సంచలనంగా మారింది.

అసలేం జరిగిందంటే..

కల్యాణదుర్గం మండలం పాతచెరువుకి చెందిన ఓ వ్యక్తికి కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. కొంతకాలం పాటు వారి కాపురం అన్యోన్యంగా సాగింది. వారికి కుమారుడు, కుమార్తె జన్మించారు. అయితే, సదరు మహిళకు గ్రామానికి చెందిన మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో వారి మధ్య విబేధాలు తలెత్తాయి. ఈ విషయంపై తరచూ గొడవలు జరిగేవి. తాజాగా వారి మధ్య మళ్లీ వివాదం చెలరేగింది. ఇక భర్తను ఎలాగైనా అడ్డు తప్పించుకోవాలని ఆమె భావించింది. కఠిన నిర్ణయ తీసుకుంది. అతను నిద్రపోయిన సమయంలో రోకలిబండతో కొట్టి హత్య చేసింది. హత్య చేసిన సమయంలో పిల్లలనూ




బెదిరించింది. విషయం బయటపెడితే ఇదే గతి పడుతుందని భయభ్రాంతులకు గురి చేసింది. అనంతరం ఇంటి ఆవరణలోనే భర్త శవాన్ని పాతి పెట్టింది. అయితే, శుక్రవారం మృతుడి కుమార్తె వేరే గ్రామంలో ఉంటున్న తన నానమ్మ ఇంటికి వెళ్లింది. చిన్నారి తన తండ్రి హత్య విషయాన్ని ఎక్కడ వారితో చెబుతుందో అని భయపడిన సదరు మహిళ వెంటనే కల్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. భర్తను హత్య చేసిన విషయాన్ని చెప్పి లొంగిపోయింది. దీంతో షాక్‌కు గురైన పోలీసులు.. వెంటనే పాత చెరువు గ్రామానికి చేరుకు న్నారు. హత్యకు గురైన బాధితుడి మృతదేహాన్ని వెలికి తీసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది.

## త్వరలోనే విజయవాడ, అనంతపురంలో తలసేమియా సెంటర్లు : నారా భువనేశ్వరి



**చిత్తూరు, (రాజధాని వార్తలు):** కుప్పం నియోజకవర్గంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి పర్యటన కొనసాగుతోంది. శుక్రవారం కుప్పం టీటీడీ కల్యాణ మండపంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వయం ఉపాధికి చేయూత' కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 40 మంది మహిళలకు కుట్టు మిషన్లు, 30 మందికి తోపుడు బండ్లు, పలువురికి వినికిడి మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను భువనేశ్వరి వివరించారు. ప్రజా సేవే పరమావధిగా ఎన్టీఆర్ పనిచేశారని భువనేశ్వరి తెలిపారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్థాపించి 29 సంవత్సరాలు పూర్తయిందన్నారు. చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటం వల్ల ట్రస్ట్ బాధ్యతలు తనకు అప్పగించారని అన్నారు. చంద్రబాబు అందించిన స్ఫూర్తితో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు తమ వంతు సాయం అందిస్తున్నామని చెప్పారు. త్వరలోనే విజయవాడ, అనంతపురంలో కూడా తలసేమియా సెంటర్లు ప్రారంభిస్తామని నారా భువనేశ్వరి ప్రకటించారు.

## రాయవరం బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన ఏపీ మంత్రులు



**ప్రకాశం, (రాజధాని వార్తలు):** మార్కాపురం మండలం రాయవరం ప్రమాద బాధితులను ఆంధ్రప్రదేశ్ మంత్రులు బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పరామర్శించారు. ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న బాధితులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి అధికారులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని.. ఎవ్వరూ అధైర్యపడొద్దని బాధిత కుటుంబాలకు మంత్రులు హామీ ఇచ్చారు. పరామర్శ అనంతరం మంత్రులిద్దరూ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.. 'మార్కాపురంలో బస్సు ప్రమాద ఘటన దిగ్భ్రాంతికి గురి చేసింది. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. హోమ్ మినిస్టర్ అనిత, రవాణా శాఖ మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డిని ఘటనా స్థలానికి పంపారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సైతం వెంటనే స్పందించారు. ప్రస్తుతం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందుతోంది. బాధితులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాయి. ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఘటనపై రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, గవర్నర్ అందరూ స్పందించారు' అని చెప్పారు. మార్కాపురంలో జరిగిన బస్సు ప్రమాద ఘటన అత్యంత బాధాకరమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. క్షతగాత్రులు కోలుకుని ఇంటికి వెళ్లే దాకా చంద్రబాబు సర్కార్ బాధ్యత తీసుకుంటుందని అన్నారు. ప్రమాదంలో మరణించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాయని ఆయన పేర్కొన్నారు. అలాగే గాయపడిన వారికి ఏపీ ప్రభుత్వం రూ.2 లక్షలు, కేంద్రం రూ.50 వేలు ప్రకటించాయని చెప్పారు. బాధితులంతా కూలి పనులు చేసుకునే పేదవాళ్లని, వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ భరోసా ఇచ్చారు. కాగా, ఈ ప్రమాదంలో 14 మంది మృతి చెందగా.. 28 మంది గాయపడిన సంగతి తెలిసిందే.

## అయ్యో పాపం.. వివాహానికి వెళ్లి ప్రాణాలు కోల్పోయారు

**కర్నూలు, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఘోర విషాద సంఘటన చోటు చేసుకుంది. తుంగభద్ర నదిలో స్నానాలకు దిగి నలుగురు మృతి చెందారు. కర్ణాటక రాష్ట్రం కుల్దీ గ్రామానికి చెందిన 15 మంది కర్నూలు జిల్లా కందుకూరుకు వచ్చారు. ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు వారంతా గ్రామానికి చేరుకున్నారు. పెళ్లి అనంతరం సరదాగా గడిపేందుకు కోసిగి మండలం ఆర్డీఎస్ ఆనకట్ట వద్దకు వారంతా వెళ్లారు. స్నానం చేసేందుకు 15 మందీ తుంగభద్ర నదిలోకి దిగారు. అయితే, లోతు ఎక్కువగా ఉండడం, ఈత రాకపోవడంతో పలువురు నదిలో కొట్టుకుపోయారు. అదృష్టవశాత్తూ కొంతమంది ప్రాణాలు రక్షించుకోగా.. ఈత రాక మునిగిపోయి నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు



మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. వారిని ఉమావతి, రత్నమ్మ, మాంతేశ్, శివానంద్‌గా పోలీసులు గుర్తించారు.

# మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

## - బి.సి.సంఘ జాతీయ నాయకులు పిన్నిక లక్ష్మి ప్రసాద్ యాదవ్





**మార్కాపురం, (రాజధాని వార్తలు):** మార్కాపురం జిల్లా కేంద్రానికి అతి సమీపంలోని రాయవరం వద్ద జరిగినటువంటి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు టిప్పును ఢీకొన్న సంఘటనలో అసువులు బాసిన 14 మందిని పోగొట్టుకున్న వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలడాన్ని బీసీ సంఘాలు అభినందిస్తున్నాయి. ఈ భయానక సంఘటనలో తీవ్ర గాయాల పాలు అయినటువంటి ప్రయాణికులందరినీ కూడా తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తన పరిధి దాటి కాపాడే ప్రయత్నం చేసి హుటా హుటిన తన వాహనంతో పాటు మిగిలిన అందుబాటులో ఉన్నటువంటి వాహనాల ద్వారా వైద్యశాలకు తరలించినటువంటి మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ పన్దరబోయిన సుబ్బారావు యాదవ్‌ను ప్రజలందరూ అభినందిస్తున్నారు. తన చేతనైనంతవరకు గాయపడ్డ వారందరికీ కూడా అపన్న హస్తము అందించి, తానే స్వయంగా వారందరినీ ప్రమాద స్థలి నుండి వాహనాల వద్దకు తన సిబ్బంది సహకారంతో మోసుకుని వస్తూ ఉండటాన్ని అందరూ ఆశ్చర్యంతో మాట్లాడుకుంటున్నారు. మానవతా దృక్పథం ఉన్నటువంటి ఇటువంటి పోలీసు ఉన్నతాధికారులు ఈ సమాజానికి నేటి పరిస్థితుల్లో ఎంతో అవసరం అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పి లక్ష్మి ప్రసాద్ యాదవ్ కొనియాడారు. ఘటన జరిగిన సమాచారం అందుకున్న వెంటనే సుబ్బారావు యాదవ్ మరియు అతని డ్రైవర్ అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ, మరో మాజీ ఆర్మీ ఆఫీసర్ సంఘటనా స్థలం వద్ద అప్పటికే మంటలు అంటుకున్న బస్సులో ఉన్న ప్రయాణికులను రక్షించేందుకు శతవిధాలా ప్రయత్నించి సుమారు 24 మంది ప్రాణాలను కాపాడడంలో ప్రముఖంగా వ్యవహరించారని పి ఎల్ పి యాదవ్ కొనియాడారు. తీవ్రమైనటువంటి కాలిన గాయాలతో హాహాకారాలు పెడుతున్నటువంటి ప్రయాణికుల యొక్క భద్రతే ముఖ్యంగా స్పందించినటువంటి పోలీసు అధికారులకు, వారికి సహకరించినటువంటి అప్పటికే గుమ్మికూడినటువంటి సామాన్య ప్రజానీకానికి తమ సంఘం తరపున చేతులెత్తి నమస్కరిస్తున్నామని పి ఎల్ పి యాదవ తెలియజేశారు. జరిగినటువంటి ఈ దుర్ఘటన మరువలేనిదని అత్యంత దారుణమైనదని ఈ ఘటనకు కారకులైనటువంటి వారిని తీవ్రంగా శిక్షించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన పిజిఆర్ఎస్ భవనం, కాన్ఫరెన్స్ హాల్ భవనాలను ప్రారంభించిన విట్ యూనివర్సిటీ ఛాన్సలర్ డా.విశ్వనాథన్, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్





**గుంటూరు, (రాజధాని వార్తలు):** గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో, VIT-AP విద్యాసంస్థల సహకారంతో 47 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించిన నూతన PGRS భవనం మరియు మినీ కాన్ఫరెన్స్ హాల్ భవనాల శిలాఫలకాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఆధ్వర్యంలో VIT యూనివర్సిటీ ఫౌండర్ మరియు ఛాన్సలర్ డా.జి.విశ్వనాథన్ ఆవిష్కరించారు. అనంతరం వేద మంత్రాల నడుమ ఈ భవనాలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... డా.జి. విశ్వనాథన్ విద్యారంగంలో విశేష అనుభవం కలిగిన వ్యక్తి కాగా, గతంలో పార్లమెంట్ సభ్యుడిగా కూడా సేవలందించారు. ఆయన నాయకత్వంలో నడుస్తున్న VIT విద్యాసంస్థలు దేశవ్యాప్తంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. అమరావతిలోని VIT-AP యూనివర్సిటీ కూడా విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తోంది. VIT - AP యూనివర్సిటీ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో PGRS భవనం మరియు మినీ కాన్ఫరెన్స్ హాల్ నిర్మించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర డీజీపీ హరీష్ గుప్తా, ఐపీఎస్ హాజరు కావలసి ఉన్నప్పటికీ, మార్కాపురంలో జరిగిన బస్సు ప్రమాద ఘటన కారణంగా అత్యవసరంగా అక్కడికి వెళ్లినందున హాజరు కాలేకపోయారని తెలిపారు. ఇప్పటి వరకు PGRS కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుదారులు తగిన సౌకర్యాల లేకుండా టెంట్లు లేదా చెట్ల కింద వేచి ఉండేవారని, ఇప్పుడు నూతన భవనం ద్వారా వారు సౌకర్యవంతంగా, ప్రశాంత వాతావరణంలో పోలీస్ ఉన్నతాధికారులకు తమ ఫిర్యాదులను సమర్పించుకోగలరని పేర్కొన్నారు. మినీ కాన్ఫరెన్స్ హాల్ మీడియా సమావేశాలు నిర్వహించేందుకు మరియు మీడియా ప్రతినిధులు సౌకర్యవంతంగా కూర్చునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ భవనాలను నిర్మించి అందించిన VIT ఛాన్సలర్ డా.విశ్వనాథన్‌కి, VIT - AP యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా VIT యూనివర్సిటీ ఛాన్సలర్ డా.విశ్వనాథన్ మాట్లాడుతూ నాకు 1967 సంవత్సరం నుంచే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో, ముఖ్యంగా గుంటూరు జిల్లాతో, సుదీర్ఘమైన అనుబంధం ఉంది. అమరావతిలో VIT-AP యూనివర్సిటీ క్యాంపస్ ప్రారంభానికి ముందే ఈ రాష్ట్రంతో నా అనుబంధం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆహ్వానం మేరకు, ఈ రాష్ట్రంలో VIT యూనివర్సిటీని స్థాపించాలనే నిర్ణయం తీసుకున్నాము. ఆయన ప్రోత్సాహంతో 2017లో VIT-AP యూనివర్సిటీ తన కార్యకలాపాలను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ యూనివర్సిటీలో సుమారు 19,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు కష్టపడే స్వభావం కలిగినవారు మరియు విద్య పట్ల విశేషమైన ఆసక్తి కలిగి ఉంటారు. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో తల్లిదండ్రులు తమ పిల్లల విద్య కోసం విస్తృతంగా ఖర్చు చేయడం సాధారణం. అందులోనూ ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రులు తమ పిల్లల ఉన్నత విద్య కోసం విశేషంగా పెట్టుబడులు పెట్టడం గమనార్హం. ఈ కృషి ఫలితంగా అనేక మంది విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలను సాధిస్తున్నారు. మా ప్రధాన లక్ష్యం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, సమగ్ర శిక్షణను అందించి, వారికి ఉత్తమమైన ఉద్యోగ అవకాశాలు కల్పించడం. గత సంవత్సరంలో VIT గ్రూపు విద్యా సంస్థల నుండి సుమారు 14,000 మంది విద్యార్థులు ఉద్యోగాలను సాధించారు. వీరిలో VIT-AP యూనివర్సిటీకి చెందిన ఒక విద్యార్థి 96.26 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాన్ని పొందడం విశేషమైన విజయంగా నిలిచింది. ఇవి మా నాణ్యమైన విద్యా విధానానికి నిదర్శనం. భారతదేశం వంటి విశాల దేశంలో, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు పేద మరియు మధ్యతరగతి విద్యార్థుల విద్యపై మరింత దృష్టి సారిస్తే, దేశం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగుతుంది. గుంటూరు జిల్లా పోలీస్ శాఖకు ఈ భవనాన్ని అందించడం ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించినందుకు నేను హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఈ కార్యక్రమంలో VIT-AP యూనివర్సిటీ చాన్సిలర్, జిల్లా ఎస్పీ, వైస్ ఛాన్సలర్ డా.అరుల్ మౌళి వర్మన్ రిజిస్ట్రార్ డా.జగదీష్ చంద్ర, అదనపు ఎస్పీలు జి.వి.రమణమూర్తి (అడ్మిన్), ఏ.హనుమంతు (ఏఆర్), ఎస్బి డీఎస్పీ శ్రీనివాసులు, డీస్పీ అలహరి శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ సంకురయ్య, అన్ని సబ్ డివిజన్ డిఎస్పిలు ఇతర పోలీస్ అధికారులు pgrs సీఐ బిలాలుద్దీన్, పట్టాపురం సిఐ జి వెంకటేశ్వర్లు, సీఐ ఆరోగ్య రాజు, సీఐ సత్యనారాయణ ఆర్మ్డ్ రిజర్వు ఆర్ఐలు సురేష్ బాబు, రామకృష్ణారెడ్డి, శివరామకృష్ణ, శ్రీహరి రెడ్డి రామకృష్ణారెడ్డి జూతీశీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# రేపు అమర జ్యోతి ఉమేష్ చంద్ర 60వ జయంతి

## - రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు - నేరస్తులకు సింహం... సామాన్యులకు అండగా నిలిచిన మహానేత - హైదరాబాద్ ఎస్ఆర్ నగర్, తెనాలి విగ్రహాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు



**హైదరాబాద్/అమరావతి, (రాజధాని వార్తలు):** పోలీసు యూనిఫాం చాలా మందికి అధికారానికి ప్రతీక. కానీ ఉమేష్ చంద్రకి అది ఒక వ్రతం – ప్రజలను కాపాడే పవిత్ర బాధ్యత. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీస్ చరిత్రలో ఆయన పేరు ధైర్యం, త్యాగానికి చిరస్థాయిగా నిలిచింది. కేవలం 33 ఏళ్ల వయసులోనే విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించి, నిజమైన పోలీసింగ్ అంటే సేవ, సమర్పణ అని నిరూపించారు. ఉమేష్ చంద్ర కఠినత్వం మరియు మానవత్వం కలగలిపిన అరుదైన వ్యక్తిత్వం. నేరస్తులు, నక్సలైట్లపై ఆయన కఠిన వైఖరి భయానకంగా ఉండేది. అదే సమయంలో సామాన్య ప్రజల పట్ల ఆయన చూపిన మమకారం ఆయనను నిజమైన “ప్రజల అధికారి”గా నిలబెట్టింది. ఈ ప్రత్యేక లక్షణాల వల్లే ఆయన పేరు నేటికీ ధైర్యానికి ప్రతీకగా నిలిచింది. 1966 మార్చి 29న గుంటూరు జిల్లా పెదపూడి గ్రామంలో జన్మించిన ఉమేష్ చంద్ర చిన్నప్పటి నుంచే ప్రతిభావంతుడు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివి, నిజాం కాలేజీలో ఆర్థిక శాస్త్రంలో గోల్డ్ మెడల్ సాధించారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో 1991లో సివిల్ సర్వీసెస్‌లో ఎంపికై ఐపీఎస్‌గా చేరారు. నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సమయంలోనే ఆయన ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. వరంగల్‌లో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన సమయంలో నక్సలైట్లపై ధైర్యంగా పోరాడారు. అనంతరం పులివెందుల, కడపలో విధులు నిర్వర్తిస్తూ ఫ్యాక్షన్ రాజకీయాలను అణచివేశారు. కడప ఎస్పీగా ఉన్నప్పుడు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచాయి. అందుకే ఆయనను “కడప సింహం”గా ప్రజలు అభివర్ణించారు. ఆయన పోలీసింగ్‌కు కొత్త నిర్వచనం ఇచ్చారు. పోలీస్ స్టేషన్లను ప్రజలకు అందుబాటులో ఉండే సేవా కేంద్రాలుగా మార్చి, స్వయంగా ప్రజల సమస్యలు విన్నారు. 1998లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలను కడపలో స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించి ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని పెంచారు. “ఉమేష్ చంద్ర లాంటి ఒక్క అధికారి ఉంటే చాలు, ప్రజాస్వామ్యం నిలుస్తుంది” అన్న మాటలు అప్పట్లో వినిపించాయి. కులం, మతం, ప్రాంతం అనే తేడా లేకుండా న్యాయం చేయడం ఆయన లక్ష్యం. నేరస్తులపై కఠినంగా వ్యవహరించినా, నిరపరాధులకు అండగా నిలిచారు. కరీంనగర్‌లో ఎస్పీగా పనిచేసిన సమయంలో శాంతి భద్రతలను పునరుద్ధరించారు. హైదరాబాద్‌లో ఎఐజీగా ఉన్నప్పుడు కూడా తన నాయకత్వంతో అందరినీ ప్రేరేపించారు. అయితే నక్సలైట్లపై ఆయన తీసుకున్న కఠిన వైఖరి ఆయన ప్రాణాలను తీసింది. 1999 సెప్టెంబర్ 4న హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్ సమీపంలో జరిగిన దాడిలో ఆయన వీరమరణం పొందారు. అప్రతీక్షితంగా జరిగిన ఆ దాడిలో కూడా ఆయన వెనుకడుగు వేయకుండా ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఆయుధాలు లేకున్నా దాడి చేసిన వారిని ఎదిరించిన ఆయన ధైర్యం నేటికీ ఉదాహరణగా నిలిచింది. ఆయన మరణం రాష్ట్రాన్ని కలచివేసింది. కానీ అదే సమయంలో ఆయనను అమరుడిగా నిలబెట్టింది. ఆయన సేవలను స్మరించుకుంటూ ఎస్ఆర్ నగర్, తెనాలి ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఆయన జయంతి, వర్థంతి సందర్భంగా ప్రజలు పెద్దఎత్తున నివాళులు అర్పిస్తారు. ప్రజల మధ్య ఆయనకు ఉన్న అనుబంధం ఎంతో గొప్పది. కడప నుంచి ఆయన బదిలీ అయినప్పుడు వేలాది మంది రోడ్లపైకి వచ్చి అడ్డుకున్నారు. ఆయనను వెళ్లనీయకుండా కన్నీళ్లు పెట్టుకున్నారు. అది ఒక అధికారి పట్ల ప్రజల ప్రేమకు నిదర్శనం. 60వ జయంతి సందర్భంగా మరోసారి ఒక నిజం స్పష్టమైంది. నిజమైన నాయకులు ఎప్పటికీ మరణించరు. వారి ఆలోచనలు, సేవలు, త్యాగం ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. ఉమేష్ చంద్ర జీవితం పోలీసింగ్‌లో ఒక అధ్యాయం కాదు... ఒక యుగం. ఆయన చూపిన మార్గం నేటి యువతకు, పోలీసు అధికారులకు మార్గదర్శకం. నిజమైన శక్తి అధికారంలో కాదు... సేవలో ఉందని నిరూపించిన మహానేత చదలవాడ ఉమేష్ చంద్ర. ఆయన పేరు చరిత్రలోనే కాదు... ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. మహానీయుడు, ధైర్యసాహసాల ప్రతిరూపం అయిన ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్ చంద్ర 60వ జయంతిని మార్చి 29, 2026న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘన నివాళులు అర్పించనున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్, గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతాల్లో ఉన్న ఆయన విగ్రహాల వద్ద ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు నివాళులు అర్పించనున్నారు.

# పీఎం సూర్యఘర్ కనెక్షన్లను వేగవంతం చేయాలి

## - అంబేడ్కర్ జయంతికి ప్రతీ నియోజకవర్గంలో 2 వేల కనెక్షన్లు - వచ్చే వ్యవసాయ సీజన్ నాటికి పెండింగ్ వ్యవసాయ కనెక్షన్లు మంజూరు - ఇంధన ఉన్నతాధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో విద్యుత్ శాఖ పరిధిలో అమలు అవుతున్న పనులను వేగవంతం చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి డిస్కంల సీఎండీలు, ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్, పీఎం కుసుమ్ పథకాల పురోగతిని సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచితంగా అందిస్తున్న పీఎం సూర్యఘర్ సోలార్ కనెక్షన్లపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి, బాబు జగజ్జీవన్ రామ్ జయంతి నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వరకు ప్రతి నియోజకవర్గంలో కనీసం 2 వేల కనెక్షన్లు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులో లక్ష్య సాధనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం, పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లన్నింటినీ వచ్చే సీజన్‌కు ముందే మంజూరు చేయాలని సూచించింది. రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ప్రజలపై అదనపు భారం లేకుండా విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వం భరిస్తుందని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో పనిచేసి పథకాల అమలులో వేగం పెంచాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# బస్సు కండిషన్‌లో లేకపోవడం, స్టీరింగ్ స్ట్రక్ అవడంతోనే ఘోర ప్రమాదానికి కారణం అని ప్రాథమిక దర్యాప్తు

**మార్కాపురం, (రాజధాని వార్తలు):** ప్రమాదానికి కొన్ని గంటల ముందే బస్సు కండీషన్‌పై ప్రయాణికులు ఆందోళన, బస్సు డ్రైవర్ సైతం బస్సు కండిషన్‌లో లేదని చెప్పడంతో మృత్యు శకటంలోనే ప్రయా ణం చేసిన ప్రయాణికులు. యర్రగొండపాలెం వద్ద గంటసేపు బస్సుకు మరమ్మత్తులు. మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదం బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఇప్పటి వరకు 13 మంది మృతదేహాలను వెలికి తీశారు. ప్రమాదం నేపథ్యంలో కీలక విషయం వెల్లడైంది. బస్సు కండీషన్పై అందులోని ప్రయాణికులు ముందుగానే ఆందోళన వ్యక్తం చేశారు.

కండీషన్ సరిగా లేదని డ్రైవర్తో చెప్పారు. దీంతో బస్సు సిబ్బంది యర్రగొండపాలెం వద్ద గంటసేపు నిలిపి మరమ్మతులు చేశారు. అనంతరం బయల్దేరిన కొంత సమయం తర్వాత మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద ఈ ఘోరం జరిగిపోయింది. బస్సు డ్రైవర్ను అధికారులు విచారిస్తే స్టీరింగ్ స్టక్ అయిందని చెప్పినట్లు తెలిసింది.

# మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసిన సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

## - పిల్లలతో కలిసి భోజనం రుచి చూసి, భోజన నాణ్యత, పరిసరాలు పరిశుభ్రతను పరిశీలించిన ఎమ్మెల్యే





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ 33వ వార్డ్ పరిధిలో ఉన్న ఎం.జీ.ఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అంది స్తున్న భోజనం నాణ్యత, టాయిలెట్ల పరిశుభ్రత పరిశీలించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న భోజనాన్ని పిల్లలతో కలిసి భోజనం రుచి చేశారు. అదేవిధంగా విద్యార్థులతో మాట్లాడి భోజన వసతులు గురించి అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులకు నేరుగా వారి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. అదే విధంగా పాఠశాల సిబ్బంది స్కూల్ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం పథకం విద్యార్థిని, విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తుందని, కూటమి ప్రభుత్వంలో పిల్లల పౌష్టికాహారంతో పాటు శక్తిని చేకూర్చే ఆహారాన్ని అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జనసేన ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ వసంత లక్ష్మి, జీకే , జనసేన వార్డు అధ్యక్షులు రాజు, కూటమి పెద్దలు, సీనియర్ నాయకులు చక్రవర్తి, సత్యానారాయణ, ఆళ్ల శ్రీనివాస్, ప్రభాకర్, వెంకట అప్పారావు, స్కూల్ ప్రధానోపాధ్యాయలు, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్, స్కూల్ సిబ్బంది, అక్షయపాత్ర నిర్వాహకులు, జనసేన పార్టీ సౌత్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి, ఇతర కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# మహిళలందరూ స్వయం ఉపాధితో వ్యాపారవేత్తలుగా ఎదగాలి : ఎమ్మెల్యే





**దొరవారిసత్రం, (రాజధాని వార్తలు):** దొరవారిసత్రం మండలంలోని ఎంపీ డీవో కార్యాలయంలో మహిళా సాధికారతకు దోహ దపడే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 'కామెల్' సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవచ్చని చెప్పారు. ప్రతి మహిళ తన కాళ్లపై నిలబడేలా ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కుట్టుమిషన్లు మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని అన్నారు. కామెల్ సంస్థ చేస్తున్న సేవలను ఎమ్మెల్యే అభినందించారు. పేద మరియు నిరుపేద మహిళలకు ఈ పథకం ద్వారా మేలు జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనేక మంది మహిళలు ఈ కార్యక్రమానికి హాజరై ఆనందం వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు కుట్టుమిషన్లు పంపిణీ చేయడం జరిగింది.

# వైభవంగా ప్రారంభమైన శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు

## - బంగారమ్మ తల్లికి సారే, వీరాంజనేయ స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన చైర్మన్ సతీష్ యాదవ్



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామస్వామి వారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల తొలి రోజు సాయంత్రం గ్రామదేవత శ్రీ బంగారమ్మ అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా సారీ సమర్పణ నిర్వహించారు. అనంతరం శ్రీ వీరాంజనేయ స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమాలు ఆలయ ఆచారాల ప్రకారం భక్తిపూర్వకంగా జరిగాయి. అలాగే యాగాది కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే అంకురార్పణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. బ్రహ్మోత్సవాల రెండవ రోజు ఉదయం వేద మంత్రోచ్చారణల నడుమ ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కోటా సతీష్ యాదవ్, కార్యనిర్వహణాధికారి గిరికృష్ణ, ధర్మకర్తలు భక్తనా రామయ్య, కొప్పుల సుబ్రమణ్యం, పాముల రవి తదితరులు పాల్గొన్నారు.

# మాతా వైష్ణోదేవి అమ్మవారికి ఎంపీ వేమిరెడ్డి దంపతుల వాహనాల అందజేత



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు జమ్మూలోని కట్రాలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మాతా వైష్ణో దేవి అమ్మవారికి రెండు వాహనాలను విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో వివిధ అవసరాల నిమిత్తం అధికారులకు రెండు వాహనాలు అందజేశారు.

# శ్రీశైలంలో ఘనంగా స్వర్ణ రథోత్సవం



## - పాల్గొన్న శ్రీశైల దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటా రెడ్డి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైలక్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు గురువారం స్వర్ణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవంలో శ్రీశైల దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి పాల్గొని రథాన్ని లాగారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆరుద్రోత్సవంలో భాగంగా తెల్లవారుజామున శివుడికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలు రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా చేపట్టారు. ఉత్సవంలో భాగంగా కళాబృందాలు కోలాటం, తప్పెట నృత్యాలు లాంటి పలు జానపద కళారూపాలు నిర్వహించారు. రథోత్సవ వేడుకలో శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు, కార్యనిర్వహణాధికారి, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ నవమి వేడుకలు







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వీ.ఆర్.ఎం.సి.హెచ్ పాఠశాలలో గురువారం శ్రీరామ నవమి వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీరాముని జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేడుకలు ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బాలికలు పట్టు పావడాలలో అందంగా మెరిసిపోగా, బాలురు ధోతి శైలిలో సాంప్రదాయంగా కనిపించారు. విద్యార్థులు దేవుడికి పండ్లు, పూలు సమర్పించి భక్తిని వ్యక్తం చేశారు. శ్రీరామ నవమి ప్రాముఖ్యతను శ్రీరాముడు పాటించిన సత్యం, ధర్మం, న్యాయం వంటి విలువలను విద్యార్థులకు వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులు రామాయణంలోని సంఘటనలను ఆధారంగా చేసుకొని పాటలు, నాటికలు ప్రదర్శించారు. ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. ఈకార్యక్రమం హెచ్.ఎం.వెంకటరావు ఇన్‌చార్జ్ హెచ్.ఎం లక్ష్మీనారాయణ పీ.ఎస్.హెచ్.ఎం. చంద్రకళ, వైస్ ప్రిన్సిపల్ హరిత, జయలక్ష్మి, పీ.డీ గురు ప్రసాద్ ఏ.ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో అత్యంత అద్భుతంగా నిర్వహించబడింది. ఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. చివరగా ప్రసాదం పంపిణీతో కార్యక్రమం ముగిసింది. ఈవేడుక ద్వారా విద్యార్థుల్లో సాంస్కృతిక అవగాహనతో పాటు నైతిక విలువలను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ఏ పి ఈ ఎమ్ సి ఎల్ నూతన లోగో ఆవిష్కరణ చేసిన చైర్మన్ దినేష్ రెడ్డి









**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏ పి ఎమ్ సి ఎల్ నూతన లోగోను విజయవాడలోని సంస్థ కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నేను (చైర్మన్‌గా), మేనేజింగ్ డైరెక్టర్ డా.ఆర్.పీ.ఖజురియాతో కలిసి లోగోను సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ నూతన లోగో రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల సమర్థ నిర్వహణ మరియు సుస్థిర అభివృద్ధి పట్ల ఏపిఈఎమ్‌సిఎల్ కట్టుబాటును ప్రతిబింబించేలా రూపొందించబడిందని రాష్ట్ర ఏ పి ఈ ఎమ్ సి ఎల్ చైర్మెన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా ప్రమాదకర వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన సమగ్ర విధానాన్ని ఈ లోగోలో స్పష్టంగా ప్రతిబింబించాము. వ్యర్థాలను ఉత్పత్తి చేసే యూనిట్ల నుండి సురక్షిత స్వీకరణ కేంద్రాలకు ప్రత్యేక హాజార్డస్ వేస్ట్ రవాణా వాహనాల ద్వారా తరలించడం, అనంతరం వాటిని రీసైక్లింగ్ చేసి తిరిగి వినియోగంలోకి తీసుకు రావడం వంటి మొత్తం ప్రక్రియను ఈ లోగో రూపకల్పనలో ప్రతిఫలింపజేశాము. లోగోలో పొందుపరిచిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిహ్నం ప్రభుత్వ అధికారికతను సూచిస్తుండగా, నీలం రంగు రాష్ట్ర తీరరేఖలను ప్రతిబింబిస్తూ సముద్రంలోకి వెళ్లే ఎఫ్లుయెంట్ డిశ్చార్జ్ పర్యవేక్షణలో సంస్థ బాధ్యతను తెలియజేస్తుంది. ఈ సందర్భంగా ఏ పి ఈ ఎమ్ సి ఎల్ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రమాణాలను అమలు చేయడానికి కట్టుబడి ఉందని రాష్ట్ర చైర్మెన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి అన్నారు. ఈ నూతన లోగో ద్వారా వ్యర్థాల నిర్వహణలో పారదర్శకత, బాధ్యత మరియు పునర్వినియోగంపై మా దృష్టిని ప్రజలకు మరింత స్పష్టంగా తెలియజేస్తున్నాము. మేనేజింగ్ డైరెక్టర్ డా. ఆర్.పీ.ఖజురియా మాట్లాడుతూ, "పర్యావరణ పరిరక్షణలో సాంకేతికతను వినియోగిస్తూ, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ ద్వారా రాష్ట్ర అభివృద్ధికి ఏ పి ఈ ఎమ్ సి ఎల్ కీలక పాత్ర పోషిస్తుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, పర్యావరణ నిపుణులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ లోగో ఆవిష్కరణతో ఏ పి ఈ ఎమ్ సి ఎల్ తన కార్యకలాపాలను మరింత విస్తరించి, పర్యావరణ రక్షణలో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

# సంపాదకీయం

## ఆధునిక రాజ్యం, అనాది నాగరికతల యుద్ధం

2026, ఫిబ్రవరి 28 ఉదయం.. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై భారీ వైమానిక దాడులు చేశాయి. 12 గంటల్లో ఇరాన్‌లోని క్షిపణి కేంద్రాలు, అణు కేంద్రాలు, సైనిక స్థావరాలపై 900 సార్లు బాంబుల వర్షం కురిసింది. ఇరాన్ అత్యున్నత నాయకుడు అలీ ఖమేనీ కుటుంబంతో సహా ప్రాణాలు కోల్పోయారు. ఈ యుద్ధం రెండుమూడు రోజుల్లో ముగిసిపోతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. పాతిక రోజుల తర్వాత.. హోర్ముజ్ జలసంధి ఇంకా తెరుచుకోలేదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రమాదం అంచున నిలబడింది. 1970లలో వచ్చిన రెండు చమురు సంక్షోభాల కంటే ప్రస్తుత పరిస్థితి దారుణంగా ఉందని అంతర్జాతీయ ఇంధన సంస్థ ప్రకటించింది. ఇరాన్ నౌకాదళం నాశనమైనా, నాయకులు హతమైనా, అణుకేంద్రాలపై మూడుసార్లు దాడులు జరిగినా.. ఆ దేశం ఇంకా పాలన సాగిస్తోంది, పోరాడుతోంది. ఇప్పటికీ అంతర్జాతీయ చర్చల్లో తన నిబంధనలనే విధిస్తోంది. మార్చి 22న ట్రంప్- '48 గంటల్లోగా హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే, ఇరాన్‌లోని పవర్ ప్లాంట్లను నాశనం చేస్తాం' అని తన 'ట్రూత్ సోషల్' వేదికగా ఒక వార్నింగ్ ఇచ్చారు. దీనికి ఇరాన్- 'పర్షియన్ గల్ఫ్ మొత్తం మందుపాతరలతో నింపేస్తామని, చమురు కేంద్రాలన్నింటినీ ధ్వంసం చేస్తామ'ని గట్టిగా బదులిచ్చింది. తను ఇచ్చిన గడువు ముగియడానికి మరో 12 గంటలు ఉందనగా.. అమెరికా, ఇరాన్ మధ్య 'చాలా మంచి, ఉపయోగకరమైన చర్చలు జరిగాయని', అందుకే దాడులను ఐదురోజులు వాయిదా వేస్తున్నానని ట్రంప్ ప్రకటించారు. ఒక మహాసామ్రాజ్యం క్షిపణులను ప్రయోగించింది. ఒక పురాతన నాగరికత ఆ దాష్టీకాన్ని తట్టుకొని నిలబడింది. ఇది ఏడువేల ఏళ్ల చరిత్ర వర్సెస్ రెండువందల ఏళ్ల అధికారం! ఇరాన్ పీఠభూమిలో 7,000 ఏళ్ల నుంచే మానవ ఆవాసం ఉంది. క్రీస్తుపూర్వం 3200 నాటికే అక్కడ ఒక గొప్ప నాగరికత విలసిల్లింది. క్రీస్తుపూర్వం 6వ శతాబ్దంలో 'సైరస్ ది గ్రేట్' పాలనలో పర్షియన్ సామ్రాజ్యం ప్రపంచంలోనే అతిపెద్ద శక్తిగా ఎదిగింది. గ్రీస్, ఈజిప్ట్, టర్కీ, ఇరాక్ నుంచి మన పక్కనే ఉన్న పాకిస్థాన్ వరకు అది విస్తరించింది. క్రీస్తుపూర్వం 539లో, యుద్ధం లేకుండానే బాబిలోన్‌ను సైరస్ జయించారు. అక్కడి ప్రజలే కోట తలుపులు తెరిచి ఆయనకు స్వాగతం పలికారు. ఆ సమయంలో సైరస్ తన ఆజ్ఞను ఒక స్తూపంపై రాయించారు. ప్రస్తుతం బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న ఆ స్తూపాన్ని, 1971లో ఐక్యరాజ్యసమితి ప్రపంచంలోనే మొదటి మానవ హక్కుల ప్రకటనగా గుర్తించింది. ఆ సైరస్ స్తూపం ప్రకారం.. ఆయన బానిసలందరికీ విముక్తిని, మతస్వేచ్ఛను, సమానత్వాన్ని ప్రసాదించారు. హీబ్రూ బైబిల్‌లో యూదుడు కాని వ్యక్తిని 'మెస్సయ్య' (దేవునిచే ఎన్నుకోబడినవాడు) అని పిలిచారంటే అది కేవలం సైరస్‌ను మాత్రమే. సైరస్ చక్రవర్తి మానవ హక్కుల పత్రాన్ని ప్రకటించిన 2,315 ఏళ్ల తర్వాత (1776లో) పుట్టిన అమెరికా.. ఇప్పుడు అదే నాగరికతను గగనతలం నుంచి నామరూపాలు లేకుండా చేయాలని చూస్తోంది. సైరస్ పత్రం వెలువడిన 2,487 ఏళ్ల తర్వాత (1948లో) ఏర్పడిన ఇజ్రాయెల్.. తన భద్రత పేరుతో ఆ నాగరికతను లొంగ దీసుకోవాలని ప్రయత్నిస్తోంది. పాతికరోజుల పాటు సాగిన ఈ వైమానిక దాడులు ఇరాన్ సుదీర్ఘ చరిత్రలో ఒక చేదు అధ్యాయం మాత్రమే. కానీ, అమెరికాకు మాత్రం ఇలాంటి యుద్ధం ఊహకందని విషయం. క్రీస్తుపూర్వం 330లో అలెగ్జాండర్ 'పెర్సెపోలిస్' నగరాన్ని తగులబెట్టాడు. 13వ శతాబ్దంలో మంగోలులు ఇరాన్ నగరాలపై విరుచుకుపడి, కొన్ని ప్రాంతాల్లో ముప్పావు వంతు జనాభాను ఊచకోత కోశారు. ఇక 1953లో బ్రిటన్ కుట్ర పన్ని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధాని మొహమ్మద్ మొసాద్దెగ్‌ను గద్దె దించింది. 1980లో అమెరికా అందించిన ఆయుధాలతో ఇరాక్.. ఇరాన్‌పై ఎనిమిదేళ్ల పాటు సాగించిన యుద్ధంలో లక్షలాది మంది ఇరానీయులు బలయ్యారు. అయినా సరే, ఇరాన్ ఇంకా ఉంది. పర్షియా ఎప్పుడూ ఇక్కడే ఉంది. ఇప్పుడు బాంబుల దాడికి గురవుతున్నది అవిసెన్నా (ఇబ్న్ సీనా) వంటి మహనీయుల నాగరికత. ఆయన రాసిన 'కానన్ ఆఫ్ మెడిసిన్' గ్రంథం ఆరు శతాబ్దాల పాటు యూరప్ విశ్వవిద్యాలయాల్లో ప్రధాన వైద్య పాఠ్యపుస్తకంగా ఉండేది. ఇది అల్-బిరూని నాగరికత. ఆయన వెయ్యేళ్ల క్రితమే భూమి చుట్టుకొలతను కేవలం ఒక శాతం తేడాతో కచ్చితంగా లెక్కించారు. యూరప్‌లో పుస్తకాలు తగులబెడుతున్న కాలంలోనే, బీజగణితంలో క్యూబిక్ ఈక్వేషన్స్‌కు పరిష్కారాలు చూపిన ఖయ్యామ్ నాగరికత ఇది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఇష్టపడే హాఫీజ్, రూమీల కవిత్వం పుట్టిన గడ్డ ఇది. టెహ్రాన్‌పై బాంబులు పడుతున్నాయంటే, ఆ గొప్ప వారసత్వాన్ని మోస్తున్న నగరంపై పడుతున్నాయని అర్థం. అటువంటి లోతైన వారసత్వం వైమానిక దాడులతో అంతమైపోదు. ఇలాంటి దాడులు ఆ పాత పౌరుషాన్ని మరింతగా తట్టి లేపుతాయి. ఫిబ్రవరి 28, 2026న మొదటి 'టోమాహాక్' క్షిపణి ప్రయోగించడానికి ముందే, ఇరాన్ దాదాపు అర్ధ శతాబ్దకాలంగా మనుగడ కోసం పోరాడుతూనే ఉంది. అమెరికా మొదటిసారిగా 1979 నవంబర్‌లో ఇరాన్‌పై ఆంక్షలు విధించింది. అమెరికా అధ్యక్షులు మారారు తప్ప ఇరాన్‌పై ఆంక్షలు ఎప్పుడూ తొలగలేదు, పైగా పెరుగుతూనే వచ్చాయి. అవి ఇరాన్‌ను మరింతగా రాటుదేల్చాయి. ఇరాన్ విడిభాగాలను దిగుమతి చేసుకోలేకపోయింది కాబట్టి, వాటిని సొంతంగా తయారు చేయడం నేర్చుకుంది. పాశ్చాత్య సాంకేతికత దొరకలేదు కాబట్టి, దాన్ని 'రివర్స్-ఇంజనీరింగ్' చేసింది. అత్యాధునిక ఆయుధాలను కొనలేకపోయింది కాబట్టి, తక్కువ ఖర్చుతో, భారీ స్థాయిలో వినూత్న ఆయుధాలను అభివృద్ధి చేసింది. అమెరికా విధించిన కఠినమైన ఆంక్షల నుంచే 'షాహెద్-136' సూసైడ్ డ్రోన్ పుట్టింది. ఒంటరిని చేసిన పరిస్థితుల్లో, అవసరం నేర్పిన తెలివితేటలకు ఈ డ్రోన్ ఒక నిదర్శనం.

# విశాఖ అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కోరంగి విజయ్ కుమార్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లాకు సంబంధించిన జిల్లా కమిటీ అధికారికంగా ఏర్పాటు చేయబడింది. ఈ నేపథ్యంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రేరణతో మరియు ఆయన సూచించిన "ప్రతి సంవత్సరం ఒక మంచి పని" అనే నినాదాన్ని ఆదర్శంగా తీసుకుని, ఈ జిల్లా కమిటీ సామాజిక సేవా కార్యక్రమాలు మరియు అభిమానుల ఐక్యతను మరింత బలోపేతం చేయడానికి కృషి చేయనుంది. అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులను ఒకే వేదికపైకి తీసుకు వచ్చి, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను కొనసాగించడానికి కట్టుబడి ఉంది అని అన్నారు.

# మార్చి 28న డిపిఎంఎస్, ఎల్ఎస్, టిడిఆర్ సమస్యలపై ప్రత్యేకంగా "టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్" కార్యక్రమం: జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, అమరావతి ఆదేశాల మేరకు మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో గల పెండింగ్‌లో ఉన్న డిసిఎంఎస్ ద్వారా నమోదైన భవనాల నిర్మాణ అనుమతులకు, ల్యాండ్ రెగ్యులరైజేషన్ పథకంలో నమోదైన అనధికార లేఔట్లలో గల ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణకు, టిడి ఆర్‌ల విడుదలకు సంబంధించిన గ్రీవెన్స్ లను పరిశీలించి వాటిని త్వరితగతిన పరిష్కరించుటకు గానూ తేది 28.03.2026 (శని వారం) న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, సమావేశం హాలులో ప్రత్యేకంగా 'టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు నిర్వహించబడుతుందని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. కావున, నగర ప్రజలు భవన నిర్మాణాల అనుమతులు, ల్యాండ్ రెగ్యులరైజేషన్, టిడిఆర్ విడుదలలకు సంబంధించి మార్చి 28న శనివారం ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు ప్రత్యేకంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నందు నిర్వహిస్తున్న "టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్" కార్యక్రమంలో మీ సమస్యల పరిష్కారం కొరకు స్వయంగా తెలియజేసుకోగలరని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చీఫ్ సిటీ ప్లానర్ కోరారు.



# సింహాచలం దేవస్థానం ప్రకటన రూ.5 వేలకు పెంచండి: ఈవోకు ఎల్ఎన్ఎ వినతి



**విశాఖ: సింహాచలం, (రాజధాని వార్తలు):** సింహాచల దేవస్థానం స్వామి వారి కళ్యాణోత్సవం, చందనోత్సవం సందర్భం గా ప్రతి ఏటా మాదిరిగానే స్థానిక దిన, వార, పక్ష, మాస పత్రికలకు యాడ్ విడుదల చేసి సహకరించాలని కోరుతూ దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జె.వెంకటరావుకు లోకల్ న్యూస్ పేపర్ అసోసియేషన్ (ఎల్ ఎన్ ఎ) ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సింహాచలంలోని పరిపాలన కార్యాలయంలో గురువారం కలిసి పలు అంశాలను ఆయన దృష్టిలో ఉంచారు. గత సంవత్సరంకంటే ముందు రూ 5 వేలు చొప్పున స్థానిక పత్రికలకు యాడ్ విడుదల చేసే వారని గత సంవత్సరం దాన్ని రూ. 2500 తగ్గించారని ఆయనకు తెలిపారు. గత సంవత్సరం కంటే ముందు మాదిరిగానే రూ. 5వేలు చొప్పున యాడ్ విడుదల చేసి స్థానిక పత్రికలకు సహకారం అందించాలని ఆయనను కోరారు. దీనిపై కార్య నిర్వహణ అధికారి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎన్ఎ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ప్రతినిధులు కె.వి.ఎస్.నరసింహం, ఎం.శ్రీహరి, టి.వి.వి. సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, బి.ఏ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# స్వీకరించిన ప్రతీ అర్జీకి కచ్చితంగా పరిష్కారం జరుగుతుంది: ఎమ్మెల్యే వంశీ

## - అర్జీలు స్వీకరిస్తున్న సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సీతంపేట కార్యాల యంలో దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ నియోజకవర్గంలో పలు వార్డుల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.
కార్యక్రమంలో అర్జీదారులతో స్వయంగా మాట్లాడారు. అదేవిధంగా అర్జీలు కొన్ని పరిష్కారం కాగా, పరి ష్కారం కాని సంబంధిత అధికారులకు తెలియపరచి వీలైనంత త్వరగా పరిష్కరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శివ ప్రసాద్ రెడ్డి, కందుల నాగరాజు, యజ్ఞశ్రీ మరియు కూటమి శ్రేణులు, వివిధ వార్డుల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 4న "రన్ ఫర్ జీసస్"




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఏప్రిల్ 4వ తారీఖున నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్ర మాన్ని క్రైస్తవ ప్రజలంతా ఏకంగా విజయవంతం చేయాలని పెద్దాపురం మండల పాస్టర్ అసోసియేషన్ రెవ బి జాన్ సునందన్ కోరారు. పెద్దాపురం పట్టణంలోని నేతల ఇమ్మానుయేల్ సహాయం స్మారక నూతన చర్చ్‌లో గురువారం రన్ ఫర్ జీసస్ కోఆర్డినేటర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రన్ ఫర్ జీసస్ జెండాలు ఆవిష్కరణ, టీ షర్ట్‌ల ఆవిష్కరణ, కాప్‌ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. రెవ. డా.పదివేల జాన్ ప్రార్థించగా క్లాప్స్ బిషప్, డా.సిబిఐ సుకుమార్ ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ డాక్టర్ పురుషోత్తం దాసు లంకా మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా రన్ ఫర్ జీసస్ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దాన్లో భాగంగానే ఏప్రిల్ నాలుగో తేదీ ఉదయం నిర్వహించే కార్యక్రమంలో ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డి వెంకట్ పాల్, రెవ. జి సత్యనందం, రెవ. కె జిమ్స్ నాగ శ్రీనివాస్, బ్రదర్ ఎన్ ఇమ్మాను యేల్ సహాయం, బ్రదర్ తలారి విజయకుమార్, బ్రదర్ పల్లా చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్‌గా ఎస్.కె.డి.వి. ప్రసాద్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖలో పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రోహిబిషన్ & ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా అమలాపురంలో విధులు నిర్వహిస్తున్న ఎస్.కె.డి.వి. ప్రసాద్ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. 2025-26 ప్యానెల్ ఇయర్‌కు సంబంధించి డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ సిఫార్సుల మేరకు రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ జీవో ఎంఎస్ నంబర్ 192ను విడుదల చేసింది. ఎస్.కె.డి.వి. ప్రసాద్‌ను రోస్టర్ పాయింట్ ఆర్ పి-60 కింద అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపిక చేశారు. ఏపీ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 1996, రూల్ 10 (ఎ) ప్రకారం ఈ అడ్హాక్ పదోన్నతి కల్పించారు. ప్రసాద్‌తో పాటు మరో 10 మంది సూపరింటెండెంట్లకు కూడా అసిస్టెంట్ కమిషనర్లుగా ప్రమోషన్ లభించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా ఈ ఉత్తర్వులను జారీ చేశారు.

# శాస్త్రోక్తంగా "మేధా దక్షిణామూర్తి" హోమం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్నంలోని నవదుర్గ ఆలయంలో వసంత నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు జరుగుతున్న వసంత నవరాత్రి పూజలో భాగంగా 8వ రోజు మేధా దక్షిణామూర్తి హోమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారిణి, దేవి పుత్రిక కనక విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరాత్రులు తొమ్మిది రోజులు పాటు లోక శాంతితో పాటు నవగ్రహాలకు శాంతి హోమాలతో పాటు 27 నక్షత్రాలకు శాంతి చండీ హోమ పూజలను లోక కళ్యాణార్ధం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేద పండితులు, ఆసాధులు అళ్ళక్కి రామ విశ్వేశ్వర శర్మ నేతృత్వంలో ఈ చండీ హోమ పూజలు జరుగుతుండగా నవరాత్రి ఉత్స వాలు ముగింపులో భాగంగా 28వ తేదీ శనివారం ఆలయంలో శాంతి మహా చండీ హోమాలు నిర్వహించి, పూర్ణహుతి చేపట్టనున్నట్టు చెప్పారు. అనంతరం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఆలయ వద్ద నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం రెండు పూటలా ఈ చండీ హోమ పూజలను నిర్వహిస్తున్నట్టు ఆలయ అధికారిణి కనక విజయలక్ష్మి చెప్పారు. ఈ పూజలో జిల్లా పరిధిలోని ప్రముఖులు పాల్గొన్నట్టు చెప్పారు. ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించాలని ఈ సందర్భంగా ఆలయ అధికారిని కనక విజయలక్ష్మి తెలిపారు. ఈ పూజల్లో వేద పండితులు ఆలయ కమిటీ భక్త నాయకులు పాల్గొన్నారు.

# గ్లామర్‌తో పిచ్చెక్కిస్తున్న లక్ష్మీరాయ్.. ఫోటోలు వైరల్



సౌత్ ఇండియన్ గ్లామర్ క్వీన్ లక్ష్మీరాయ్ సోషల్ మీడియాలో మరోసారి సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. తన అందచందాలతో కుర్రాళ్ల గుండెల్లో మంటలు పుట్టించడంలో ఈ ముద్దుగుమ్మ రూటే సెపరేట్. తాజాగా బాలి వెకేషన్‌లో ఎంజాయ్ చేస్తున్న ఈ భామ, స్విమ్మింగ్ పూల్‌లో బ్లాక్ బికినీ ధరించి దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఈ ఫోటోలను చూసిన నెటిజన్లు ఆమె గ్లామర్‌కు ఫిదా అవుతూ లైకులు, కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం.. లక్ష్మీరాయ్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. 2005లో 'కాంచన మాల కేబుల్ టీవీ' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈమె, మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత 'అధినాయకుడు', 'బలుపు', 'వేర్ ఈజ్ వెంకటలక్ష్మి' వంటి సినిమాల్లో నటించి మెప్పించింది. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి 'ఖైదీ నెంబర్ 150' మరియు పవన్ కళ్యాణ్ 'సర్దార్ గబ్బర్ సింగ్' చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌లో చిందేసి మాస్ ఆడియన్స్‌కు పూనకాలు తెప్పించింది.

ప్రస్తుతం సమ్మర్ సీజన్ నడుస్తుండటంతో, ఎండ వేడి నుంచి తప్పించుకోవడానికి లక్ష్మీరాయ్ ఇండోనేషియాలోని దీవుల్లో సేద తీరుతోంది. అక్కడ ఒక లగ్జరీ రిసార్ట్ స్విమ్మింగ్ పూల్‌లో చిల్ అవుతూ దిగిన ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. బ్లాక్ కలర్ బికినీలో తన పర్ఫెక్ట్ బాడీని ఎక్స్‌పోజ్ చేస్తూ మైండ్ బ్లాక్ అయ్యే స్టిల్స్ ఇచ్చింది. ఈ ఫోటోలకు 'ఇట్స్ ఏ సైన్.. బాలి ఈజ్ మైన్' అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ ఇచ్చి తన క్రేజ్‌ను మరింత పెంచేసుకుంది.

# విరోష్ మొదటి నెల ప్రయాణం అందమైన కలలా



టాలీవుడ్ లవ్ కపుల్ విజయ్ దేవరకొండ – రష్మిక మందన్న (విరోష్) తమ వైవాహిక జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నారు. వీరిద్దరూ వివాహం చేసుకుని అప్పుడే ఒక నెల గడిచిపోయింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ జంట తమ మొదటి నెల వార్షికోత్సవాన్నిఅత్యంత ప్రేమపూర్వకమైన వాతావరణంలో జరుపుకున్నారు. గత నెలలో జరిగిన వీరి వివాహం దక్షిణాది సినీ పరిశ్రమలోనే అత్యంత చర్చనీయాంశమైన వేడుకగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని విజయ్ దేవరకొండ తన ఇన్‌స్టాలో షేర్ చేసిన ఒక పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. రష్మికతో కలిసి ఉన్న ఒక సహజమైన.. అందమైన ఫోటోను షేర్ చేస్తూ –ఫరెవర్– అని ఆయన క్యాప్షన్ ఇచ్చారు. ఈ పోస్ట్‌కు రష్మిక స్పందిస్తూ హార్ట్ ఎమోజీలను జత చేసి తన ప్రేమను వ్యక్తపరిచారు. ఈ ఒక నెల కాలం తమకు ఒక అందమైన కలలా గడిచిపోయిందని.. తమ మధ్య బంధం మరింత బలపడిందని విజయ్ తన సన్నిహితులతో షేర్ చేసుకున్నారు. పెళ్లి తర్వాత కూడా ఈ జంట తమ వృత్తిపరమైన బాధ్యతలను ఏమాత్రం విస్మరించడం లేదు. హనీమూన్ కోసం ఒక చిన్న వెకేషన్‌కు వెళ్లి వచ్చిన వెంటనే ఇద్దరూ తమ సినిమా షూటింగ్‌లతో బిజీ అయిపోయారు. రష్మిక ప్రస్తుతం తన తదుపరి పాన్ ఇండియా చిత్రాల పనుల్లో నిమగ్నమై ఉండగా.. విజయ్ కూడా తన కొత్త ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. కెరీర్, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేయడంలో ఈ జంట అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ప్రస్తుతం వీరు ముంబైలో తమ కొత్త కాపురాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం.


సోషల్ మీడియాలో విరోష్ హ్యాష్ ట్యాగ్‌తో అభిమానులు పండుగ చేసుకుంటున్నారు. విజయ్ పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే లక్షలాది లైకులు, కామెంట్లు వచ్చి చేరాయి. అభిమానులు తాము ప్రేమించిన జంటను ఒకటైనందుకు సంతోషిస్తూ.. వారు కలిసి నటించిన గీత గోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాల క్లిప్పింగులను ఎడిట్ చేసి షేర్ చేస్తున్నారు. టాలీవుడ్, బాలీవుడ్‌కు చెందిన పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ జంటకు తమ శుభాకాంక్షలను తెలియజేశారు.

# బాలీవుడ్ ఎంట్రీతో శ్రీలీలకి బ్రేక్ దొరుకుతుందా?



టాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీ శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో ఒక గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. 'పెళ్ళి సందడి', 'ధమాకా' వంటి సినిమాలతో టాలీవుడ్‌లో తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న ఈ భామకు, ఇటీవల వరుస పరాజయాలు పెద్ద దెబ్బ తీశాయి. తాజాగా విడుదలైన 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించకపోవడంతో శ్రీలీల ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఒకప్పుడు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా వెలిగిన ఈమె చేతిలో ప్రస్తుతం ఒక్క క్రేజీ తెలుగు ప్రాజెక్ట్ కూడా లేకపోవడం గమనార్హం. అందుకే ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ తన దృష్టిని బాలీవుడ్ వైపు మళ్ళించింది. ఆ వివరాలు చూద్దాం. శ్రీలీల కెరీర్ ఒకప్పుడు రాకెట్‌లా దూసుకుపోతుందనుకున్నారు అందరూ. ఆమె డ్యాన్స్, ఎనర్జీకి ఫిదా అయిన స్టార్ హీరోలందరూ తమ సినిమాల్లో ఆమెనే హీరోయిన్‌గా తీసుకోవాలని పోటీ పడ్డారు. కానీ, కథల ఎంపికలో జరిగిన పొరపాట్లు ఆమెను ఇబ్బందుల్లోకి నెట్టాయి. 'ఆదికేశవ', 'స్కంద', 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' వంటి సినిమాలు వరుసగా ఫ్లాప్ అవ్వడం శ్రీలీల మార్కెట్‌ను దెబ్బతీసింది. తాజాగా వచ్చిన పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా ఫెయిల్ అవ్వడంతో టాలీవుడ్ మేకర్స్ ఈమె వైపు చూడటానికి కాస్త ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగులో అవకాశాలు తగ్గుతున్న క్రమంలో శ్రీలీల ఇప్పుడు బాలీవుడ్ ఎంట్రీతో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. బాలీవుడ్ యంగ్ స్టార్ కార్తీక్ ఆర్యన్ సరసన ఒక భారీ ప్రాజెక్ట్‌లో నటించే అవకాశం దక్కించుకుంది. హిందీ మార్కెట్‌లో ఈ సినిమా కనుక క్లిక్ అయితే, శ్రీలీల రేంజ్ మళ్ళీ మారిపోవడం ఖాయం. గ్లామర్ పరంగా, డ్యాన్స్ పరంగా బాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకోవడం శ్రీలీలకు పెద్ద కష్టమేమీ కాదు. ఇక మరి ఈ బాలీవుడ్ బ్రేక్ ఆమె కెరీర్‌ను మళ్ళీ ట్రాక్‌లోకి ఎక్కిస్తుందో లేదో వేచి చూడాలి. శ్రీలీల కేవలం బాలీవుడ్ మాత్రమే కాదు, కోలీవుడ్ మీద కూడా కన్నేసింది. వెర్సటైల్ యాక్టర్ ధనుష్‌తో కలిసి ఒక సినిమాలో నటిస్తున్నట్లు సమాచారం. ధనుష్ వంటి స్టార్ హీరో పక్కన ఛాన్స్ రావడం శ్రీలీలకు దొరికిన గోల్డెన్ ఆఫర్ అని చెప్పాలి. తమిళ్ మార్కెట్‌లో కూడా తన సత్తా చాటితే, సౌత్ ఇండియా మొత్తం మళ్ళీ ఈమె జపం చేయడం ఖాయం. ఇక ప్రస్తుతం తన ఫోకస్ మొత్తం టాలీవుడ్ బయటే పెట్టిన ఈ భామ, ఇతర భాషల్లో సక్సెస్ సాధించి మళ్ళీ తెలుగులో గ్రాండ్ కమ్‌బ్యాక్ ఇవ్వాలని ప్లాన్ చేస్తోంది. సినిమా ఇండస్ట్రీలో హిట్లు, ఫ్లాపులు సహజం. ఒకప్పుడు టాప్‌లో ఉన్న హీరోయిన్లు కూడా ఇలాంటి కష్టకాలాన్ని చూసినవారే. శ్రీలీలకు ఉన్న టాలెంట్, డ్యాన్సింగ్ స్కిల్స్ మరే హీరోయిన్‌కు లేవనే చెప్పాలి. కేవలం ఒక సాలిడ్ హిట్ పడితే చాలు, మళ్ళీ శ్రీలీల డేట్స్ కోసం నిర్మాతలు క్యూ కడతారు. బాలీవుడ్ మరియు కోలీవుడ్ ప్రాజెక్టులు ఆమెకు ఆ ఊపును ఇస్తాయని ఫ్యాన్స్ గట్టిగా నమ్ముతున్నారు. ఇక మరి శ్రీలీల తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ఎంత పవర్‌ఫుల్‌గా స్టార్ట్ చేస్తుందో రాబోయే రోజుల్లో చూడాలి!

# పెద్ది.. మరోసారి తారక్ కనెక్షన్స్



రామ్ చరణ్ 'పెద్ది' సినిమా అప్‌డేట్స్ వస్తున్న కొద్దీ ఒక పాత వార్త మళ్ళీ నెట్టింట హల్చల్ చేస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ సినిమా కంటే ముందు దాదాపు రెండేళ్ల పాటు జూనియర్ ఎన్టీఆర్ చుట్టూ తిరిగిన విషయం అందరికీ తెలిసిందే. అప్పట్లో తారక్ కోసం ఆయన ఒక కుస్తీ నేపథ్యంలో సాగే కథను సిద్ధం చేశారని ఇండస్ట్రీలో గట్టిగా వినిపించింది. అయితే కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కక పోవడంతో, అదే కథను ఇప్పుడు చరణ్ తో తీస్తున్నారా అనే అనుమానం చాలా మందిలో కలుగుతోంది. నిజానికి ఎన్టీఆర్ కోసం బుచ్చిబాబు అనుకున్న కథలో హీరో ఒక యాక్సిడెంట్‌లో కాళ్లు కోల్పోతాడని, ఆ తర్వాత కుస్తీ టీమ్‌కు కోచ్‌గా మారి తన కల నెరవేర్చుకుంటాడని అప్పట్లో ప్రచారం జరిగింది. చరణ్‌తో సినిమా అనౌన్స్ చేసినప్పుడు మాత్రం బుచ్చిబాబు ఒక మాట చెప్పారు. తారక్‌కు చెప్పిన కథ వేరని, చరణ్ కోసం రాసుకున్నది అసలు సంబంధం లేని కొత్త సబ్జెక్టు అని క్లారిటీ ఇచ్చారు. కానీ విడుదలైన 'పహిల్వాన్' గ్లింప్స్ చూశాక సోషల్ మీడియాలో సీన్ మొత్తం మారిపోయింది. ఈ గ్లింప్స్‌లో చరణ్ ఒక పక్కా కుస్తీ యోధుడిలా, ఆ బాడీ లాంగ్వేజ్‌తో కనిపిస్తుంటే అందరికీ తారక్‌కు చెప్పిన పాత కథే గుర్తొస్తోంది. అప్పట్లో కుస్తీ కోచ్‌గా ఎన్టీఆర్‌ను ఊహించుకున్న వాళ్లంతా, ఇప్పుడు చరణ్‌ను అదే గెటప్‌లో చూసి ఇది కచ్చితంగా ఆ పాత స్క్రిప్టే అని ఫిక్స్ అయిపోతున్నారు. ఒకవేళ అదే కథ అయితే, అప్పుడు అనుకున్న కుస్తీ పాయింట్ కు ఇప్పుడు క్రికెట్ ఎలిమెంట్స్ ను కూడా జోడించి బుచ్చిబాబు ఏదో కొత్త మ్యాజిక్ చేస్తున్నట్లు అనిపిస్తోంది. ఒక స్టార్ హీరో కోసం రెండేళ్లు కష్టపడి రాసుకున్న కథను వదులుకోలేక, దానికే కొన్ని మార్పులు చేసి చరణ్ ఇమేజ్‌కు తగ్గట్టుగా సెట్ చేశారనేది ఇప్పుడు వినిపిస్తున్న మాట. గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన చరణ్‌కు ఇలాంటి ఒక ఇంటెన్స్ ఎమోషనల్ రోల్ పడితే ఆయన కెరీర్‌కు అది పెద్ద ప్లస్ అవుతుంది. కానీ బుచ్చిబాబు మాత్రం మొదటి నుంచీ ఇవి రెండు వేర్వేరు కథలని చెబుతూనే వస్తున్నారు. ఈ కన్ఫ్యూజన్ మీద దర్శకుడు మళ్ళీ ఏమైనా స్పందిస్తాడేమో చూడాలి. ఏప్రిల్ 30న ఈ సినిమా థియేటర్లలోకి రాబోతోంది. అప్పటివరకు ఈ కథల చర్చలు సాగుతూనే ఉంటాయి. చరణ్ ఒక పహిల్వాన్‌గా తన విశ్వరూపాన్ని చూపించడానికి రెడీ అవుతుంటే, మేకర్స్ మాత్రం ఈ పాత కథల పోలికల మీద సైలెంట్‌గానే ఉంటున్నారు. బుచ్చిబాబు తన స్ట్రాటజీతో ఈ పాత కథనే కొత్తగా ఎలా ప్రజెంట్ చేస్తారో తెలియాలంటే సినిమా రిలీజ్ వరకు ఆగాల్సిందే.

# ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవ వేడుకలు




**విజయనగరం, (రాజధాని వార్తలు):** రంగస్థలం అత్యంత పవిత్రమైనదని, నాటకాలు సమాజానికి దర్పణం వంటివని ఘంటసాల సంగీత సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు సముద్రాల గురుప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిత్య హైస్కూల్ లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కం నాటకం సమాజంలో సాంఘిక దురాచారాన్ని అరికట్టిందని, నాటకాలు సమాజానికి చుక్కానిగా నిలుస్తాయని అన్నారు. వేదం వేంకటరాయ శాస్త్రి రచించిన బొబ్బిలియుద్ధం, చిలకమర్తి లక్ష్మీ నరసింహం రచించిన గయోపాఖ్యానం, గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కం, బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్య హరిశ్చంద్ర, తిరుపతి వెంకట కవులు రచించిన శ్రీకృష్ణ రాయబారం, సి కె వెంకటరామయ్య రచించిన తెనాలి రామకృష్ణ, కాళ్లకూరి నారాయణరావు రచించిన వరవిక్రయం వంటి నాటకాలు ప్రాచుర్యం పొందాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల నటులు ఈపు విజయ్ కుమార్, ముళ్లపూడి సుభద్రాదేవి, మండా రమేష్, దుర్గాప్రసాద్, కోండ్రు కృష్ణారావు,ఎం.టి.వి లక్ష్మణరావులు వివిధ నాటకాలకు సంబంధించిన పాత్రలను ప్రదర్శించారు. రమేష్ మండా చేసిన దుర్యోధన ఏకపాత్రాభినయంను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం కళాకారులను గురుప్రసాద్‌తో కలసి సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త కన్నయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, బాలాజీ, శ్రీలక్ష్మీ తదితరులు సత్కరించారు.

# సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

## - ఈవీఎం భద్రతా గిడ్డంగి తనిఖీలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు

**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** ఈవీఎం భద్రతా గిడ్డంగి వద్ద ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం మరియు వీవీప్యాట్ భద్రతా గిడ్డంగిని జిల్లా కలెక్టర్ గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీలో చేశారు. గిడ్డంగి భద్రత మరియు నిర్వహణను పరిశీలించిన ఆయన ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా ఈ తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన సిసి టివీ నిఘా, పోలీసు భద్రతను సమీక్షించిన ఆయన భద్రతా రిజిస్టర్లను తనిఖీ చేసి, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈవీఎంల నిల్వ సామర్థ్యం, గాలి వెలుతురు సరిగ్గా ఉండేలా చూడటం మరియు తేమ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గిడ్డంగిలోని అగ్నిమాపక పరికరాల పనితీరు బాగుండాలని అన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం గోడౌన్ సీల్స్ సక్రమంగా ఉన్నాయని




ధృవీకరించుకున్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌లోని వివరాలను ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లు మరియు వీవీప్యాట్ల సంఖ్యతో సరిపోల్చి చూశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవిన్యూ, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు రాజ్యాంగ ఫలాలు అందిద్దాం

## - ఎస్టీలపై దాడులు, వేధింపులను తీవ్రంగా పరిగణించాలి

## : రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జిరెడ్డి




**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** గిరిజనులు అందాల్సిన రాజ్యాంగ ఫలాలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డా.ఎన్ ప్రభాకర రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని గిరిజన సమస్యలు, వారి సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. గత రెండు రోజులుగా జిల్లాలో పర్యటిస్తున్న చైర్మన్ గిరిజనుల నుంచి నేరుగా వినతులు స్వీకరించడం జరిగిందని అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకే కమిషన్ ఉందని గుర్తుచేశారు. అందులో భాగంగా గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సాధ్యమైనంత వరకు పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. జిల్లాస్థాయిలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనతో చేసిన ముస్తాబు కార్యక్రమం రాష్ట్రస్థాయిలో అమలుకావడం గర్వకారణమన్నారు. ఆ కార్యక్రమాన్ని తాను కూడా స్వయంగా పరిశీలించడం జరిగిందని, అద్భుతమైన కార్యక్రమమని కొనియాడారు. అలాగే మన్యం డాన్స్, ఆనందలహరి ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు నూతన ఉత్తేజం, ఉత్సాహంతో చదువుకుంటారని అన్నారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో గిరిజనుల సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**గిరిజన సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత : జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి**

జిల్లాలో గిరిజన సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని, ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఎదుట వచ్చిన ప్రతి ఫిర్యాదును యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆయన అధికారులను కోరారు. గతంలో ఎస్సీ కమిషన్ పర్యటన సందర్భంగా నెల రోజుల వ్యవధిలోనే శతశాతం ఫిర్యాదులను పరిష్కరించి జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని కలెక్టర్ గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఈసారి కూడా గ్రీవెన్స్ పరిష్కార వేగం, నాణ్యతలో జిల్లాను అగ్రస్థానంలో ఉంచాలని సూచించారు. ముఖ్యంగా చట్టపరమైన చిక్కులు లేని సమస్యలను తక్షణమే పరిష్కరించి, పారదర్శక సేవలు అందించాలని స్పష్టం చేశారు. పునర్విభజనలో భాగంగా ఏర్పడిన బ్యాక్‌లాగ్ పోస్టులన్నింటిని భర్తీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఇటీవల కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రిని వ్యక్తిగతంగా కలిసి జిల్లా సమస్యలను వివరించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. మన్యం జిల్లాను పర్యాటక రంగంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.రాష్ట్రంలోనే అత్యధిక జలపాతాలు కలిగిన జిల్లాగా, స్థానిక గిరిజన కమ్యూనిటీ భాగస్వామ్యంతో పర్యాటక అభివృద్ధికి మన జిల్లా ఒక నమూనాగా నిలుస్తోందన్నారు. గ్రామ ముస్తాబు కార్యక్రమం ద్వారా గిరిజన పల్లెల్లో పారిశుధ్యం మెరుగుపడిందని కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. ఒకప్పుడు మలేరియాకు నిలయంగా ఉన్న ఈ ప్రాంతం, నేడు గిరిజనుల చైతన్యం వల్ల అనేక గ్రామాలు మలేరియా రహితంగా మారటం, జిల్లా సాధించిన గొప్ప విజయమని కొనియాడారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం మరియు ఉన్నతాధికారుల సహకారం నిరంతరం కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్.వి. మాధవ్ రెడ్డి మాట్లాడుతూ ఎస్టీలపై దాడులకు సంబంధించి గతేడాది 4 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది రెండు కేసులు నమోదు అయినట్లు తెలిపారు. ఎస్టీలపై జరిగే దాడుల విషయంలో పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీని చైర్మన్ ఆదేశించారు. ఆదివాసీ సంఘం నేతలు మాట్లాడుతూ.. గిరిజనులకు రాజ్యాంగపరమైన హక్కులు దక్కేలా చూడాలని, బోగస్ సర్టిఫికేట్లపై లోతైన విచారణ జరపాలని కోరారు. ఆదివాసీ గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు సంబంధించి అటవీశాఖ అభ్యంతరం లేకుండా చూడాలని, ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. విద్యార్థుల మృతుల కుటుంబాలకు నష్టపరిహారాన్ని చెల్లించే దిశగా చర్యలు తీసుకోవాలని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. అంతకుముందు జిల్లాలో గిరిజనుల కోసం అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమం - అభివృద్ధి కోసం తీసుకున్న చర్యలపై జాయింట్ కలెక్టర్, ఇంచార్జ్ ఐటీడీఏ పిఓ సి.యస్వంత్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చైర్మన్‌కు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, జాయింట్ కలెక్టర్ సి.యస్వంత్ కుమార్ రెడ్డి, ఎస్టీ కమిషన్ సభ్యులు జి.సునీతా, కె.మల్లేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి కె హేమలత, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# ఆర్.టి.సి బస్ స్టేషన్లు ఆహ్లాదకరంగా ఉండాలి

## - ప్రయాణీకులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదు - స్టేషన్లు, ఆవరణలో పారిశుధ్యానికి పెద్ద పీట : జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి





**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని ఆర్.టి.సి బస్ స్టేషన్లు ప్రయాణీకులకు ఆహ్లాదాన్ని ఇచ్చేలా, అన్ని రకాల మౌలిక వసతులతో ఉండాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన పార్వతీపురం ఆర్.టి.సి బస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్ స్టేషన్‌లోని ప్లాట్‌ఫారమ్‌లు, తాగునీటి వసతి, విక్రయ దుకాణాలు, మరుగుదొడ్లు, పారిశుధ్య పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ప్రయాణీకులతో మాట్లాడి ఆర్టీసీ ద్వారా అందుతున్న సేవలను, సేవలతో పూర్తిస్థాయిలో సంతృప్తిగా ఉన్నారా అని ప్రశ్నించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులకు కలెక్టర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్వహించే ప్రజా స్పందనలో ప్రయాణీకులు శత శాతం సంతృప్తి చెందేలా సేవలు అందించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. బస్ స్టేషన్ల ఆవరణలో నీరు నిలిచి ఉండటం గమనించిన ఆయన పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని, ప్రాంగణం ఎప్పుడూ శుభ్రంగా ఉండాలని అన్నారు. చెత్తాచెదారం లేకుండా, ప్రయాణీకులు కూర్చునే చోట ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. వేసవి దృష్ట్యా ప్రయాణీకులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని, మరుగుదొడ్ల నిర్వహణ నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఓఆర్ఎస్ పాకెట్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రయాణీకులకు ఇబ్బంది కలగకుండా తగినంత లైటింగ్, ఫ్యాన్లు పనిచేసేలా చూడాలని అన్నారు. ఆర్.టి.సి సిబ్బంది ప్రయాణీకుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బస్సుల రాకపోకల సమయాల గురించి కచ్చితమైన సమాచారం అందించాలని సూచించారు.

ఆర్.టి.సి బస్ స్టేషన్ అనేది ప్రజలకు ఒక దేవాలయం వంటిదని, దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణీకులు ఇక్కడ అలసట తీర్చుకుంటారని అన్నారు. కాబట్టి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కాలపరిమితి దాటిన తినుబండారాలు దుకాణాల్లో విక్రయించకుండా చూడాలని, అలాగే అధిక ధరలకు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ తనిఖీలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, జిల్లా ప్రజా రవాణా అధికారి కె.శ్రీనివాసరావు, ఆర్.టి.సి డిపో మేనేజర్ ఎస్.లక్ష్మణరావు, ఇతర రెవెన్యూ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీమంత్రి "బొత్స" ను కలిసిన యువ నాయకులు

**బొండపల్లి, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** వైకాపా మాజీ మంత్రి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను మండల యువ నాయకులు గురువారం నాడు ఆయన స్వగృహంలో కలిశారు. కొద్ది రోజుల క్రితం మండలి సమావేశాల సమయంలో మండల ప్రతిపక్ష నేత బొత్స స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనకు వైద్యం అందించారు. ప్రస్తుతం మాజీ మంత్రి బొత్స విజయనగరంలో ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు మూకల చలంనాయుడు, యువ నాయకులు జగదీష్, సతీష్ తదితరులు మాజీ మంత్రి బొత్సను ఆయన స్వగృహంలో కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా మాజీ మంత్రి బొత్స ప్రస్తుతం తన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని పార్టీ నాయకులు కార్యకర్తలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి




**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలం కొండ బుచ్చంపేట గ్రామ సమీపంలో గల విద్యుత్ స్తంభం సమీపంలో గల మలుపు వద్ద ఏర్పాటు చేసిన సిగ్నల్ బోర్డునకు మక్కువ నుంచి తిరుగు ప్రయాణంలో వస్తున్న దిగువమెండంగి గ్రామానికి చెందిన వ్యక్తి శ్రీధరపు శంభు వయసు 20 సంవత్సరాలు ఢీకొన్నాడు తలకు బలమైన గాయాలు కావడంతో అటుగా వెళుతున్న వారు గమనించి వెంటనే అతన్ని మక్కువ పీహెచ్సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మక్కువ పోలీసులు సమాచారం తెలుసుకొని వెళ్లి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం బాడీని సాలూరు తరలించారు.

# మ్యుటేషన్స్ తిరస్కరణలు తగ్గాలి

## -పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ వేగంగా జరగాలి - రెవిన్యూ అధికారుల సమీక్షలో స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి




**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీని వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, రీసర్వే, 22 ఏ భూములు తదితర రెవెన్యూ అంశాలపై దిశానిర్దేశం చేశారు. వీటిపై జే.సి సేదు మాధవన్‌తో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్ రామ సుందర్ రెడ్డి మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం, రీసర్వే వేగవంతం చేయాలని తహసీల్దారులను ఆదేశించారు. ఒక్క తప్పుకూడా లేకుండా పాసుపుస్తకాలను రూపొందించాలని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. అదేవిధంగా మ్యుటేషన్లను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని దీనిలో జిల్లా వెనుకబడి ఉందని దానిని మెరుగుపరచాలని కోరారు.

**జిల్లాలో గ్యాస్ కొరత లేదు:**

ఈ సందర్భంగా జే.సి సేదు మాధవన్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్ పి జి కొరత లేదని అయినా పత్రికలలో కొరత ఉన్నట్టు విరుద్ధ వార్తలు వస్తున్నాయని వాటిని అబ్జర్వ్ చేయాలని అదే విధంగా ఇళ్లకు సప్లై చేసే సిలిండర్లు ఎంత మాత్రం కొరత లేకుండా, పాఠశాలలు సాంఘిక సంక్షేమ, బీసీ వెల్ఫేర్, వసతి గృహాలు మొదలగు వాటికి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. వాట్సప్ గవర్నెన్స్ సేవలు పెరగాలని రెవిన్యూ అధికారులకు జేసీ ఆదేశించారు. ఐ.వి.ఆర్.ఎస్, ఇంటర్ డిపార్టుమెంటల్ అంశాలపై జిల్లా అధికారులతో జె సి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవిన్యూ పిటిషన్లుకు సంబంధించి తహశీల్దార్లు వ్యక్తిగతంగా హాజరు కావాలని అన్నారు. రెవెన్యూ క్లినిక్‌లో వచ్చిన పిటీషన్లను పెండింగ్లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ, రీ సర్వే, జాయింట్ ఎల్ పి ఎంలు తదితర విషయాలపై జెసి సమీక్షించారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ సత్తిబాబు, ఎస్ డి సి ఇ. మురళి, ఆర్డీ.డి.ఓలు, వర్చువల్‌గా తహసిల్దార్లు, ఎం.పి.డి.ఓలు, పాల్గొన్నారు.

# దేశ ఆర్థిక పురోగతికి 'దివాళా చట్ట సవరణ బిల్లు' దోహదం

## - దేశంలో ఎన్.సి.ఎల్.టి బెంచ్‌లు మరిన్ని ఏర్పాటు చేయాలి - లోక్‌సభలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ, (రాజధాని వార్తలు):** దేశ ఆర్థిక పురోగతికి 'దివాళా చట్ట సవరణ బిల్లు-2025' ఎంతగానో దోహదం చేస్తుందని, దేశ ప్రయోజనాల దృశ్యా కేంద్రం ప్రవేశపెట్టిన సవరణ బిల్లుకు జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం లోక్ సభలో కేంద్రం ప్రవేశపెట్టిన దివాళా చట్ట సవరణ బిల్లు-2025 పై జరిగిన చర్చలో జనసేన పార్టీ తరఫున ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడి బిల్లుకు మద్దతు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వంలో దేశం గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు, నేడు భారత్ ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందన్నారు, అయితే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత సమర్థవంతంగా పని చేయాలంటే మూలధనం అనుత్పాదక రంగాల నుండి ఉత్పాదక రంగాలకు వేగంగా మారాలన్నారు. ఆర్థిక సర్వే 2025-26 ప్రకారం దేశంలో వివిధ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్ సి ఎల్ టి) బెంచ్ ల ముందు 30 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉండడం, కేసుల పరిష్కారానికి పదేళ్లు పైగా పట్టడంవల్ల రుణ దాతల నమ్మకాన్ని దెబ్బతీయడంతో పాటు, పెట్టుబడిదారుల నమ్మకం కోల్పోతుందన్నారు. సవరణ బిల్లు ద్వారా కేవలం 150 రోజుల్లోనే కేసులు పరిష్కరించడంతో పాటు, గ్రూపు దివాలా వ్యవస్థ ద్వారా అనుబంధ సంస్థల సమస్యలను ఒకేసారి పరిష్కరించవచ్చునని తెలిపారు, దీంతో పాటు కేసుల సత్వర పరిష్కారం, పెండింగ్ కేసులు తగ్గించేందుకు దేశంలో లా ట్రిబ్యునల్ బెంచ్‌లు మరిన్ని పెంచాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మరోవైపు దివాలా చట్ట సవరణతో ఆంధ్రప్రదేశ్‌కు మేలు జరుగుతుందన్నారు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని, సవరణ బిల్లు ద్వారా రాష్ట్రంలో పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచడంతో పాటు, అనేక కీలక రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించేందుకు దోహదం చేస్తుందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన సవరణ బిల్లు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు చిరస్మరణీయం

## - బోడసకుర్రులో 16 అడుగుల వెంకటరెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటుకు ప్రయత్నాలు : రెడ్డి సుబ్రహ్మణ్యం, అనంత కుమారి



**కొత్తపేట, (రాజధాని వార్తలు):** దొమ్మేటి వెంకటరెడ్డి వర్ధంతి సందర్భంగా గురువారం కొత్తపేట ఆర్.ఎస్. బీసీ కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఏపీ బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి కలిసి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దొమ్మేటి వెంకటరెడ్డి సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని, ముఖ్యంగా శెట్టిబలిజ వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచి పోతాయని తెలిపారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చూపిన దారిలోనే ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.వెంకటరెడ్డి సేవలను, ఆశయాలను స్మరించుకుని సమాజ అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. శెట్టిబలిజ సమాజానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, ఆ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. వెంకటరెడ్డి స్ఫూర్తితో సమాజం మరింత ఏకమై అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. ఆయన త్యాగాలు, సేవలను ఎప్పటికీ మర్చిపోలేమని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని తెలిపారు. అతి త్వరలోనే బోడసకుర్రు బ్రిడ్జి వద్ద 16 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆ విగ్రహ ఆవిష్కరణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని భవిష్యత్ నాయకుడు నారా లోకేష్‌ని ఆహ్వానిస్తామని చెప్పారు.

# ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు శ్రీ విశ్వేశ్వర చంద్రశేఖర స్వామివార్ల కళ్యాణ మహోత్సవాలు

**పెద్దాపురం. (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో వేంచేసి యున్న శ్రీ విశ్వేశ్వర చంద్రశేఖర స్వామి వార్ల వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 27వ తేది నుండి మే 2వ తేదీ వరకు స్వామివార్ల కళ్యాణ మహోత్సవాలు నిర్వహించబడునని దేవస్థాన చైర్మన్ బట్ల యుగంధర్ సర్వేశ్వరరావు, దేవస్థాన ఇది కె.జగదీశ్వరరావులు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మకర్త మండలి సమక్షంలో కళ్యాణ మహోత్సవాల కరపత్రాలు విడుదల చేశారు. ఏప్రిల్ 27వ తేది స్వామి వారి కళ్యాణం, ఏప్రిల్ 30వ వార్షికోత్సవం, మే 2న పుష్పయాగోత్సవం నిర్వహించబడునని వారు పేర్కొన్నారు.



# దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించిన బండారు శ్రీనివాస్





**ఆలమూరు, (రాజధాని వార్తలు):** ఆలమూరు మండలం పెదపళ్ల జనసేన పార్టీ అధ్యక్షుడు కుడిపూడి దుర్గాప్రసాద్ మృతి పట్ల కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం కుడిపూడి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ అండగా నిలుస్తుందని ఆయన అన్నారు. అనంతరం పినపల్ల జనసేన పార్టీ నాయకుడు కొనగళ్ళ ధనరాజు మాతృమూర్తి నాగమణి, కలవచర్ల, మూలస్థానం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి ధనరాజును బండారు శ్రీనివాస్ పరామర్శించారు. అలాగే కల్వచర్లలో ఇటీవల మృతి చెందిన వనం నరేంద్ర కుటుంబ సభ్యులను, మూలస్థానంలో తోట వెంకటరత్నం తోట సత్యవతి ఎర్రం శెట్టి మోహన్ వెంకటేష్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. బండారు శ్రీనివాస్ వెంట జనసేన పార్టీ నాయకులు సురపురెడ్డి సత్య సంగీత సుభాష్, నల్లా వెంకన్న, గారపాటి త్రిమూర్తులు గారపాటి శ్రీనివాస్ చౌదరి



సలాది జయప్రకాష్ నారాయణ, బైరిశెట్టి రాంబాబు, చల్లా బాబీ, ధనరాజు, గోపు గోపాలకృష్ణ, ఉండమట్ల బాలాజీ, నామాల సుబ్బారావు, యనమదల శ్రీనివాస్, మాకిరెడ్డి బాబి తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సివిల్ జడ్జి దీప దైవ కృపకు "లా"లో డాక్టరేట్



**పెద్దాపురం. (రాజధాని వార్తలు):** పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జ్ మరియు అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ కొడాలి దీప దైవ కృపకు "లా" లో డాక్టరేట్ ప్రదానం చేసిన ఆంధ్రా విశ్వవిద్యాలయం 2010లో జూనియర్ సివిల్ జడ్జ్‌గా ఉద్యోగం పొంది ప్రమోషన్‌పై ప్రస్తుతం సీనియర్ సివిల్ జడ్జ్ మరియు అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్‌గా పెద్దాపురం కోర్టులో విధులు నిర్వహిస్తున్న కొడాలి దీప దైవ కృప మహిళలపై జరిగే గృహ హింస - సంబంధిత చట్టాలు- పరిపాలన - న్యాయ స్థానాల దృక్కోణం అనే అంశం పై జరిపిన పరిశోధనకు విశాఖపట్టణంలోని ఆంధ్రా విశ్వవి ద్యాలయం డాక్టరేట్ పట్టాను 25-3-2026 న జరిగిన 91వ మరియు 92వ స్నాతకోత్సవంలో ప్రదానం చేశారు. డాక్టరేట్ పొందడం పట్ల ఆమె తల్లితండ్రులు కొడాలి సత్య ప్రభాకర్, విజయకుమారి మరియు పెద్దాపురం బార్ అసోసియేషన్ వారు కోర్టు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

# తైక్వాండో బెల్ట్ ప్రమోషన్ టెస్టుకు బ్లూబెల్స్ విద్యార్థులు ఎంపిక

**రావులపాలెం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం పోతంశెట్టి రామిరెడ్డి పార్క్ నందు నిర్వహిస్తున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలకు ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్ బ్లూ బెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూలు విద్యార్థులలో బొక్క మోహిని శ్రీలత, అడ్డాల అరహ దమయంతి, కాశీ సౌమ్య, తాళ్ల సౌందర్య, తోరాటి అఖిల మంగాదేవి, టేకుమూడి అనునాగ తేజస్విని శ్రీదేవి, అడ్డాల లోహిత్ నివాస్, కాలా అక్షయ జ్వాలా గ్రేస్, కాలా సాకేత్ ప్రిన్స్, ఎంపికైనట్లు కోచ్ టీ వెంకటలక్ష్మి తెలిపారు. విద్యార్థులను స్కూల్ కరెస్పాండెంట్ ఈడుపుగంటి పద్మావతి టీచర్స్ అభినందించారు.




# తల రాతను మార్చలేం కానీ.. తలకు హెల్మెట్ పెట్టి చావును తప్పించవచ్చు

## - రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ ఎస్సై నరేష్





**జొన్నాడ (ఆలమూరు), (రాజధాని వార్తలు):** హెల్మెట్ భారం కాదు.. మన ప్రాణానికి రక్షణ కవచమని మన కోసం ఇంట్లో ఎదురు చూసే ప్రాణాలున్నాయని, హెల్మెట్ ధరించడం మర్చిపోకూడదని, తల రాతను మార్చలేం కానీ... తలకు హెల్మెట్ పెట్టి చావును తప్పించుకోవచ్చునని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్ అన్నారు. ఆలమూరు మండలం జొన్నాడ నుండి మడికి వరకు 216ఏ జాతీయ రహదారిపై వెళ్ళు ద్విచక్ర వాహనదారులకు ఆలమూరు ఎస్సై జి నరేష్ తో కలిసి హెల్మెట్ దారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ విద్యాసాగర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి మీ ప్రాణాలు కాపాడుకోవాలని, రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా హెల్మెట్లు ధరించాలని అన్నారు. స్టైల్ కోసం హెల్మెట్ వదలద్దని, మన లైఫ్ కోసం హెల్మెట్ మరువద్దని, బైక్ రేస్ కాదు.. హెల్మెట్ లేకపోతే నీజీవితం లాస్ అని మీ తల మీ కుటుంబానికి ఆస్తిని దానిని జాగ్రత్తగా చూసుకోండని హెచ్చరించారు. అనంతరం హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రధాన ఉపయోగాలను వివరిస్తూ ప్రాణాపాయం నుండి రక్షణ రోడ్డు ప్రమాదాల్లో సంభవించే మరణాలలో 80% పైగా తలకు తగిలిన గాయాల వల్లే జరుగుతాయని, హెల్మెట్ ధరించడం వల్ల మెదడుకు గాయం అయ్యే ప్రమాదం 70% నుండి 80% వరకు తగ్గుతుందని, కంటి రక్షణ హెల్మెట్ ముందు ఉండే గ్లాస్ ప్రయాణ సమయంలో గాలి, ధూళి, పురుగులు, ఇసుక రేణువులు కంట్లో పడకుండా కాపాడుతుందని, దీనివల్ల దృష్టి మళ్ల కుండా ప్రశాంతంగా వాహనం నడపవచ్చునని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల జరిమానాలు కట్టాల్సిన అవసరం ఉండదుని, ఇది మీ ఆర్థిక పొదుపుతో పాటు బాధ్యతా యుతమైన పౌరుడిగా గుర్తింపునిస్తుందని అన్నారు.

అనంతరం హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో మెగ్గా ప్లేస్మెంట్ డ్రైవ్




**పెద్దాపురం. (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలి దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కాలేజిలో మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ను గురువారం కళాశాల చైర్మన్ బేకనీడి శ్రీనివాసరావు ప్రారంభించారు. దీనిలో భాగంగా 9 కంపెనీలు ఫార్స్ కాన్, టాటా ఎలక్ట్రానిక్స్, డెక్కన్ కెమికల్స్, అపోలో టైర్స్, సుందరం లి. బ్యాంకర్స్, బ్రేక్స్ ఇండియా లిమిటెడ్, ఇషూజీ మోటార్స్, ఇండో ఎన్ఐఐఎమ్. హుండాయ్ మోటార్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని డిప్లమో. బిటెక్ విద్యార్థులను వారి నైపుణ్యాలకు అనుగుణంగా ఎంపిక చేయడం జరిగింది. 200 మంది విద్యార్థులు పాల్గొనగా, 102 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి అపాయ్మెంట్ ఆర్డర్లను ఆయా కంపెనీల ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బి. సృజన్, ప్రిన్సిపల్ ఇసర్వరామేశ్వరుడు, ప్లేస్మెంట్ ఆఫీసర్తో పాటు అధ్యాపక బృందం, తదితరులు విద్యార్థులను అభినందించినవానిలో ఉన్నారు.

**RAJADHANI CLASSIFIEDS Ad. Call**
**9440662699, rajadhanivartalu.com**

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబంధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎల్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# తెలుగుదేశం అప్రతిహత శక్తి ప్రసారిణి



**(రాజధాని వార్తలు):** రాష్ట్రంలో 44 ఏళ్ళ క్రితం ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీకి ఒక చారిత్రక నేపథ్యం ఉంది.తెలుగువాడి ఆత్మగౌరవం అభివృద్ధి నినాదంతో స్వర్గీయ ఎన్టీరామారావు స్థాపించిన తెలుగుదేశంపార్టీ జాతీయ స్థాయిలో ఎన్నో ప్రాంతీయ పార్టీలకు ఆదర్శమైంది. దేశవ్యాప్తంగా 57 ప్రాంతీయ పార్టీలు ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీకి ఉన్న చరిత్ర మిగతా ఏ పార్టీకి లేదనే చెప్పాలి. ఢిల్లీ పెద్దల అహంకారపు చెరలో తెలుగువారి ఆత్మగౌరవం అవమానాలు ఎదుర్కోవడం చూసి ఆ తెలుగు పౌరుషం రగిలిపోయింది. ఒక తెలుగుబిడ్డగా తెలుగువాడి తేజం ఏంటో ప్రపంచానికి చూపించాలంటే... తన రాజకీయ రంగ ప్రవేశం అనివార్యం అని భావించారు.సుదీర్ఘ కాంగ్రెస్ పాలనకు ప్రత్యామ్నయంగా 1982 మార్చి 29న తెలుగుదేశం ఆవిర్భవించింది. తెలుగు ప్రజల ఏకైక ఆశాదీపం తెలుగుదేశం పార్టీ నిలిచింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావమే ఒక చరిత్ర. ఇది కేవలం అధికారం కోసం ఆవిర్భవించిన పార్టీ కాదు. తెలుగునాట అతి పెద్ద సామాజిక విప్లవానికి నాంది పలికింది. నాలుగు గోడల మధ్యకే పరిమితం అయిన రాజకీయం తెలుగుదేశం ఆవిర్భావంతో సామాన్యుని ముంగిటకు చేరింది. నాడుమదారాసీ పరదాల మాటున మగ్గిపోతున్న తెలుగుజాతి ఔన్నత్యానికి ఎన్టీఆర్ వెలుగును ప్రసాదిస్తే చంద్రబాబు హయాంలో ఆ వెలుగు విశ్వవ్యాప్తం అయింది. నారా లోకేష్ ఆ వెలుగు మసకబారకుండా మరింతగా వన్నె తెస్తున్నారు. తాజాగా 3.0 వెర్షన్‌తో తెలుగుదేశం పార్టీని మరింత పటిష్టంగా తీర్చిదిద్దే పనిలో నారా లోకేష్ రేయింబవళ్ళు శ్రమిస్తున్నారు. టీడీపీ పుట్టిన తర్వాత పది సార్లు రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరిగితే ఆరు సార్లు అధికార పగ్గాలు చేపట్టిన ఏకైక ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం ఒక్కటే. దేశంలోనే తెలుగుదేశం పార్టీకి ఒక ప్రత్యేకత వున్నది. దేశ రాజకీయ యవనికపై దశాబ్దాలుగా ప్రస్థానం సాగిస్తున్న అతికొద్ది ప్రాంతీయ పార్టీలలో తెలుగుదేశం ముందువరుసలో వుంది. వర్తమాన రాజకీయాలలో తెలుగుదేశం పార్టీకి ఎదురైనన్ని సవాళ్లు మరే ఇతర పార్టీకి ఎదురుకాలేదు. ఎన్నో సవాళ్లు, ప్రతికూల పరిస్థితులకు తట్టుకొని మనుగడ సాగించడం తెలుగుదేశం పార్టీకే చెల్లింది. అందుకు పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వేసిన పునాది, చంద్రబాబు దానిని పటిష్టం చేసిన వైనం అందుకు ప్రధాన కారణం. తెలుగునేలపై అతిపెద్ద సైన్యం తెలుగుదేశం పార్టీ సొంతమనే చెప్పాలి. 44ఏళ్ల తర్వాత కూడా తెలుగునాట 45.60 శాతం ఓటింగ్ కలిగి వుండటం సాధారణ విషయం కాదు. టిడిపి ఆవిర్భావం నుంచి జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ తోనే రాజకీయ పోరాటం జరిపింది. ఆ పార్టీని కూకటివేళ్లతో పెకలించి 1983వ సంవత్సరంలో ఎన్టీఆర్ తెలుగుజాతి సత్తాను ప్రపంచానికి చాటారు. కేవలం అధికారం చేపట్టడమే గాక, తెలుగుజాతి గౌరవాన్ని, ప్రతిష్టను పెంపొందించడం, తెలుగు ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడం, పేద, బడుగు, బలహీన వర్గాలలో జీవనరేఖలు వికసింప చేయటం వంటి అంశాలు రాష్ట్ర చరిత్రలో టిడిపికి చెరగని ముద్ర వేశాయి. టిడిపి మూల సిద్ధాంతంలోనే సామాజిక న్యాయం ఇమిడి ఉన్నది. ఎన్టీఆర్ తొలి కేబినెట్‌ను కానీ చంద్రబాబు నాయుడు మంత్రి వర్గాలను పరిశీలిస్తే సామాజిక న్యాయం ఏ స్థాయిలో అమలైంది అవగతమవుతుంది. అత్యంత కీలకమైన శాఖలను ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించారు. నేటికీ సామాజిక న్యాయం నూరుశాతం అమలవుతున్నది ఒక్క తెలుగుదేశం పార్టీలోనే అంటే అతిశయోక్తి కాదు. దేశంలో మరే ప్రాంతీయ పార్టీకి లేని విధంగా అత్యున్నత స్థాయిలో విధాన నిర్ణాయక మండలి (పోలిట్ బ్యూరో) ఒక్క టిడిపికి మాత్రమే వుంది. ఆ మండలిలో సభ్యుల సామాజిక వర్గాలను పరిశీలిస్తే టిడిపిలో అసలైన సామాజిక న్యాయం అమలవుతున్న విషయం స్పష్టమవుతుంది. టిడిపి హయాంలో ప్రవేశ పెట్టిన ఎన్నో పథకాలు సంక్షేమం అన్న పదానికి భాష్యం చెప్పాయి. ఆ పథకాలు దేశ రాజకీయాలకు ఒక ప్రామాణికంగా, దిక్సూచిగా మారాయి. రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం ప్రవేశ పెట్టడం అప్పట్లో ఒక చరిత్ర. ఆ పథకం దేశవ్యాప్తంగా ఆహారభద్రత చట్టం రూపకల్పనకు దారితీసింది. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ లు, పేదలకు జనతా వస్త్రాలు, పక్కా గృహాలు, తెలుగు గ్రామీణ క్రాంతి పథం వంటి పథకాలు, వివిధ రకాల పేర్లతో నేటికీ చలామణి అవుతూనే వున్నాయి. అనంతరం పార్టీ సారథ్య బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు పార్టీని మరో స్థాయికి తీసుకెళ్లారు. అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల స్వారీ మాదిరి పరుగులు పెట్టించారు. ఎప్పటికప్పుడు అందివస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పాలనకు జోడించి గుడ్ గవర్నెన్స్ కు రూపకల్పన చేసి ప్రపంచమంతా తెలుగునేల వైపు తలతిప్పి చూసేలా చేశారు. ఐటి విప్లవాన్ని సృష్టించారు. యువతను ఉద్యోగాల కోసం వెంపర్లాడే స్థితి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయి పారిశ్రామిక వెత్తలుగా తీర్చిదిద్దారు. నేడు ప్రపంచంలో అగ్రగాములుగా గుర్తింపు పొందిన దేశాల ఆర్థిక వ్యవస్థల్లో తెలుగు పారిశ్రామిక వేత్తలు కీలక భూమిక పోషిస్తున్నారంటే అందుకు చంద్రబాబు దూరదృష్టితో చేపట్టిన నిర్ణయాలే కారణం. తెలుగుదేశం పార్టీ వెనుకబడిన వర్గాలకు రాజకీయాధికారం భాగస్వామ్యం కల్పించింది. తెలంగాణలో పటేల్, పట్వారీ వ్యవస్థల రద్దుతో వెనుకబడిన వర్గాలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నాయి. నేడు తెలంగాణలో వివిధ పార్టీలలో ఉన్నత స్థానాలలో వున్న బిసి నాయకులలో చాలామందికి తెలుగుదేశం పార్టీయే రాజకీయంగా జన్మనిచ్చింది. స్థానిక సంస్థలలో రిజర్వేషన్‌లు కల్పించటం ద్వారా బిసి వర్గాలు స్థానిక స్వపరిపాలనలో భాగస్వాములు అయ్యారు. వర్తమాన రాజకీయాల్లో పూటకొక పార్టీ మారుతున్న నాయకులు మనకు తారసపడుతున్నారు. అయితే గత 44 సంవత్సరాలుగా రాజకీయ ఒడిదుడుకులు, వత్తిళ్లు, ప్రలోభాలు, బెదిరింపులు కు లొంగకుండా ఓకే పార్టీలో రాజకీయ ప్రస్థానం సాగిస్తున్న నాయకులు టిడిపిలో కోకొల్లలుగా వున్నారు. ఈ అరుదైన ఘనత మరే ఇతర ప్రాంతీయ పార్టీలోనూ కానరాదు. అంతేగాక క్షేత్ర స్థాయిలోనూ నాలుగు దశాబ్దాలుగా ఏ విధమైన పదవులు ఆశించకుండా పార్టీ పతాకం మోస్తున్న కార్యకర్తలు తెలుగు నేల నలుచెరగులా వున్నారు. కుల, మత, వయో, లింగ భేదాలకు అతీతంగా వున్న కార్యకర్తల శ్రేణి టిడిపికి రక్షాకవచంగా వుంది. టిడిపికి చంద్రబాబు వంటి నాయకుడు తరగని ఆస్తి. చంద్రబాబు నాయకత్వంలో సుశిక్షితుడైన సైనికుని తరహాలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పార్టీ శ్రేణులలో పోరాట స్ఫూర్తి నింపుతున్నారు. ఈ విధంగా తెలుగుజాతి చరిత్రపై చెరగని పచ్చబొట్టులా తెలుగుదేశం పార్టీ నిలిచింది. నేడు నాలుగు దశాబ్దాల ప్రస్థానాన్ని విజయవంతంగా ముగించుకొని 45 వ ఏట అడుగు పెట్టింది. ఈ సందర్భంలో మరో నాలుగు దశాబ్దాల పాటు పార్టీని తిరుగులేని శక్తిలా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న చంద్రబాబు నారా లోకేష్‌లకు తెలుగు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు.

**నవ్యాంధ్ర నిర్మాణానికి శ్రీకారం..చంద్రన్న పాలనా శకం :**

ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబు పాలనతో మొదలయ్యింది మరో సంచలన శకం. "కదలి సాగుదాం మనం జన్మభూమికి... తల్లి పాల ఋణం కొంత తీర్చడానికి" అంటూ ప్రజలను పాలనలో భాగస్వాములను చేర్చారు చంద్రబాబు. ప్రజల వద్దకు పాలన వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్య, ఉపాధి రంగాలలో స్త్రీలకు 331/3 శాతం రిజర్వేషన్ కల్పించారు. సంస్కరణల ద్వారా ఆర్థిక పునర్నిర్మాణం చేసారు. విద్యుత్ సంస్కరణలు, డ్వాక్రా సంఘాల ఏర్పాటు, బీసీలకు 33 శాతం రిజర్వేషన్ చంద్రబాబు పాలనా సంచలనాలు. శాసనసభకు మొదటి దళిత మహిళా స్పీకర్. భారత లోక్‌సభకు మొదటి దళిత స్పీకర్‌ను అందించడం చంద్రబాబు సమతా స్ఫూర్తికి నిదర్శనం. విజన్ 2020 అంటూ 20 ఏళ్ళ ముందే ఇప్పుడు మనకేం కావాలో... ఇప్పుడు మనమేం ఎంజాయ్ చేస్తున్నామో వాటన్నిటికీ రూపునిచ్చారు నారా చంద్రబాబు నాయుడు. నాలెడ్జ్ ఎకానమీని అభివృద్ధి చేయడం కోసం అమెరికా వీధుల్లో 14 రోజులు ఫైళ్లు పట్టుకుని తిరిగారు. హైదరాబాద్‌లో 1998లో ప్రారంభమైన హైటెక్‌సిటి ఒక అంతర్జాతీయ సంచలనం. జంట నగరాల రాజధానికి సైబర్ సిటీని చేర్చడం మాత్రమే కాదు ఔటర్ రింగ్ రోడ్డుకు ఒక రూట్ మ్యాప్ ఇచ్చింది, శంషాబాద్ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం తెచ్చింది కూడా చంద్రబాబే. ఈ-సేవా సెంటర్లే కాదు... రైతు బజార్లను తెచ్చింది కూడా చంద్రబాబే. 2002లో 32వ జాతీయ క్రీడలను, 2003లో మొదటి ఆఫ్రో-ఆసియన్ గేమ్స్‌ను నిర్వహించి తన పాలనా స్థాయిని, సమర్థతను నిరూపించుకున్నారు. ఎన్టీఆర్ రూపంలో పేదలకు పట్టెడన్నం, కట్టుకోడానికి బట్ట, తలదాచుకోడానికి పక్కా ఇల్లు అందిస్తే... చంద్రబాబు రూపంలో సామాన్యుడి కలలకు రెక్కలు తొడిగి ఆకాశాన్ని అందుకునే అవకాశాలను అందించింది తెలుగుదేశం. ప్రజలకు ఏం కావాలో సమకూర్చుతూనే... మరోపక్క ప్రజలకు అక్కరలేని ఫ్యాక్షనిజం, మత ఘర్షణలు, రౌడీయిజం, నక్సలిజం వంటి వాటిపై ఉక్కుపాదం మోపి అణిచేసారు చంద్రబాబు. ఆ ఫలితంగా పగబట్టిన అరాచక శక్తులు 2003 అక్టోబరు 1న తిరుపతి బ్రహ్మోత్సవాలకు వెళుతున్న చంద్రబాబు కాన్వాయిపై అలిపిరి వద్ద క్లేమోర్ మైన్‌లు పేల్చి హత్యాయత్నం చేశారు. వెంకన్న సంకల్పమేమో కానీ... అంతటి ఘోరం నుంచి చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు చంద్రబాబు. ప్రజాసమస్యలు తెలుసుకోవడం కోసం... అక్టోబర్ 2, 2012 నుండి ఏప్రిల్ 27, 2013 వరకు 'వస్తున్నా మీ కోసం' అంటూ పాదయాత్ర చేపట్టి... 63 సంవత్సరాల వయసులో 208 రోజులపాటు, 2,817 కి.మీల దూరం నడిచారు చంద్రబాబు. పార్టీ పెట్టిన కొత్తలో ఎన్టీఆర్ చైతన్య రథయాత్ర తర్వాత... ప్రజల నుంచి అంతటి అపూర్వ స్పందన చంద్రబాబు పాదయాత్రకు లభించింది. ఎక్కడికక్కడ తెలుగుదేశం శ్రేణుల్లో కదనోత్సాహాన్ని నింపింది. అవరోధాలనే అవకాశాలుగా మలుచుకునే నేర్పరితనం చంద్రబాబు సొంతం. అందుకే రాజధాని లేని నవ్యాంధ్రకు ప్రపంచ స్థాయి రాజధాని నగరాన్ని అందించడానికి ప్రజా రాజధాని అమరావతిని నిర్మించడానికి పూనుకున్నారు చంద్రబాబు. ఆయన మీది నమ్మకంతో అడగ్గానే రాజధాని కోసం 33 వేల ఎకరాలను ప్రజలు ఇవ్వడం నభూతో నభవిష్యతి. సచివాలయం, హై కోర్టు నిర్మాణాలు రికార్డు స్థాయిలో జరిగాయి. చంద్రబాబు మార్కు అభివృద్ధికర పాలనతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలోనూ గర్వంగా తలెత్తుకునే స్థాయికి చేరింది. కియా, హీరో, సెల్కాన్ వంటి ఎన్నో కంపెనీలు ఏపీకి వరుసకట్టాయి. ఇక పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని దాదాపు తుది దశకు తీసుకురావడం, పట్టిసీమ పూర్తి... ఇలాంటివన్నీ చంద్రబాబుకు తప్ప అనితర సాధ్యం. ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్నా ప్రజల పక్షమైన తెలుగుదేశం పార్టీకి విశ్రాంతి అనేది లేదు. సమసమాజం నిర్మించబడి, పేదరికం లేని ఆనందకరమైన జీవితం ప్రతి తెలుగువాడికి అందించే వరకు జీవనదిలా, నిత్య చైతన్య ప్రవాహంలా చరిత్రను తనలో ఇముడ్చుకుంటూ ముందుకు పోతుంది తెలుగుదేశం. పసుపు అంటే ప్రజలకు శుభాన్ని ఇచ్చేది. పసుపు దళం అంటే ప్రజలకు భరోసా ఇచ్చేది. తెలుగు దేశం అంటే అప్రతిహత శక్తి ప్రసారిణి.

**వాసంశెట్టి సుభాష్,**
కార్మిక శాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan